


# గమ్యం

మధురాంతకం నరేంద్ర

**రాళ్ల గుట్టలు రెండూ మబ్బుల్ని అందుకోవాలని పైకెగిరి అందుకోలేక కుప్పకూలిన నెమళ్లలా కనిపిస్తున్నాయి. విచ్చలవిడిగా విచ్చుకున్న పింఛాల్లా మామిడి తోటా, చెరకు తోటా గుట్టల పాదుల నుంచీ పరుచుకున్నాయి.**

**మూడెకరాల మామిడి తోట, దాని కానుకునే రెండెకరాల మడి, ఆ పక్కనే రెండెకరాల లేదోట - మొత్తం ఏడెకరాల భూమి. తూర్పూ, ఉత్తర దిక్కుల్లో ఎల్లలుగా రెండు చిన్న రాళ్ల గుట్టలు, పడమటి వైపున చిన్న మట్టి బాట, దక్షిణంలో సన్నటి కొండ వారవ. అటు వైపున అవతలి వాళ్ల చేన్లూ, తోటలూ.**

సాయంకాలం కావస్తున్నా ఎండలో తీవ్రత తగ్గలేదు. నీడలు మాత్రం లేతబడుతూ సాగుతున్నాయి.

మడికి ఆగ్నేయ మూలలో అయిదార్సు పవరు మోటారు పెట్టి గంగమ్మవాడి జాటీలా కర్ణకఠోరమైన శబ్దాల్ని ప్రసారం చేస్తోంది. అయిదా రడుగులు పెరిగిన చెరుకు తోటలో నీళ్లు కడుతున్నాడు రెడ్డప్ప. చెరుకును గుములు చుట్టి రెండు మూడు వారాలు గడిచినట్టుంది. అప్పుడప్పుడూ చేతిలోని పారను పక్కన పెట్టి, గుముల్లోంచీ విడివడి గాలిలో ఊగుతున్న సోగ చెరకుల్ని గుముల్లోకి చేర్చి ఆకులు చుడుతూ, నీటి కాలువలో నడుస్తున్నా డతను.

దాదాపు అయిదున్నర అడుగుల పొడవున్న నల్లటి ఆకారం అతడిది. నలభై ఏళ్లయినా రాక మునుపే సంక్రమించిన బట్టతల. మిగిలిన వెంట్రుకల్లో సైతం ఎక్కువ శాతం తెల్ల వంట్రుకలే! మోకాళ్ల వరకూ పైకెత్తి కట్టుకున్న పాత గళ్ల లుంగీ తప్ప ఒంటి మీద ఆచ్ఛాద నేమీ లేదు.

రెండు కాళ్లూ వెడల్పుగా చేసుకుని, గెనిమలు తిప్పి ఎడకాలవ తిప్పుతూ అతను కాలువలో ముందుకు కదులుతుంటే చిక్కిన బావురు కప్ప ఎగిరి ముందుకు గెంతుతున్నట్టే ఉంది. ఎంత మెల్లగా నడుస్తున్నా నీళ్లు తొందరగా సాగడం లేదు. విసుగ్గా పారను అవతలికి విసిరి, గుముల్లోంచీ బయటి కొచ్చి వేరుగానే నిల్చుంటా నని మొరాయిస్తున్న చెరుకు సోగను గుముల్లో ఇమడ్చడానికి విఫల ప్రయత్నం చేసి, గసలు బోసుకుంటూ దూరంగా వచ్చి గట్టు మీద కూర్చున్నాడు రెడ్డప్ప. లుంగీ మడతల్లో దోపుకున్న బీడీ కట్టనూ, అగ్గిపెట్టెనూ పైకి తీసి బీడీ వెలిగించుకున్నాడు.

గుప్పుమని పొగ పీల్చక ముందే పెద్దగా దగ్గు ముంచుకొచ్చింది. తమాయించుకోవడం కోసం



పక్కకు తిరిగి దగ్గసాగాడు.

తెల్లగా సుళ్లు తిరుగుతున్న బీడీ పొగల కవతల ఆగంతుకు డొకడు కనిపించగానే ఉలిక్కిపడ్డా డతను.

నడుము వరకూ పంచగానూ, తరువాత అంగవస్త్రంగానూ ఒంటికి చుట్టుకున్న కాషాయరంగు ఏకవస్త్రం లోంచి నిగనిగ లాడుతున్న ఆగంతుకుడి శరీరం పందిరిలోంచి వేలాడుతున్న సొరకాయని తలపిస్తోంది. ముఖకవళికల్ని కప్పిపెడుతున్న పొడవాటి తెల్లగడ్డం. సగానికి పైగా బట్ట తల. వెనకున్న జుట్టు భుజాలపైన పడుతోంది. నుదుటిపైన పెద్ద పెద్ద విభూతి రేఖలు. ముక్కుపైన, రెండు కనుబొమలకూ మధ్య పెద్ద కుంకుమ బొట్టు. మెడలో రుద్రాక్షమాలలు రెండు.

"నువ్వు కాలవలో నడస్తా ఉండే చెరుకు తోటకు నీళ్లు కడతా ఉన్నట్టు లేదు. ఆ నడకా, ఆ తీరూ చెరువులో చేపలు పట్టే వాడి మాదిరిగా కనిపిస్తా ఉండావు!'' ఏమంటా వన్నట్టుగా నవ్వసాగా డతను.

బీడి దమ్ము మరో సారి లాగి, ఓ పొడి దగ్గు దగ్గి, తన నలా హడలగొట్టిన వ్యక్తి వైపుకు చికిలి చూపులు సారిస్తూ, 'ఎవ్వరు సామీ నువ్వు? ఇ ట్లెందు కొచ్చినావు?' అన్నాడు రెడ్డప్ప.

పొలం గట్టు పైన, చెరుకు తోట నీడలో కూర్చుంటూ, "చెరుకు గుములు చుట్టి పోయినో డెవుడో పలాతనమైనోడుగా ఉండాడు. అరా కొరాగా పని చేసి పోయినాడు. నువ్వ దగ్గిర కాపెట్టుకో నుండలేదా?'' అని అడిగాడు స్వామి.

అతడి వై పో సారి తేరిపార జూసి, "చూస్తే చానా సేపుట్నించి యీడ నిలబడుకోను న్నట్టుండావు. ఎంత సే పయింది సామీ ను వ్విట్లొచ్చి? ఈడ నీ కేం పని?'' అంటూ విసుక్కున్నాడు రెడ్డప్ప.

చుట్టూ కలయజూసి "లేదోట గూడా బాగానే తయా రయ్యింది. నాలు గేండ్లయిందా మామిడి చెట్లు నాటి?'' అని ప్రశ్నించా డతను.

రెడ్డప్ప సమాధానం చెప్ప లేదు.

స్వామి కూడా కాస్సేపు మౌనంగా ఉండిపోయాడు. తరువాత బిగ్గరగా నిట్టూర్చి, "ఇప్పటి కథ గాదు. నలభై యాభై సంవత్సరాల సంగతి. ఈ తావులో, ఇక్కడ్నే, ఈ గుట్టల పక్కన ఇప్పుడు నువ్వు పార పట్టుకోని నీళ్లు పారగట్టిన చోటులో నేను గూడా సేద్యం చేసినానులే! అప్పటికి నువ్వు పుట్టుండేవు ... అది సరేలే! నువ్వు వెంకటసిద్దయ్య కొడుకేనా? లేకపోతే ..." అంటూ పరకాయించి చూడసాగాడు.

ఎదుటి వ్యక్తి దారి తప్పి వచ్చిన బాటసారి కాదన్న విషయం తేలిపోవడంతో బీడీ పీకను అవతలికి గిరవాటు పెట్టి "కొడుకేలే! ను వ్వెవురో చెప్పు, సామీ! ని న్నీ ఇలాకాలో నే నెప్పుడూ చూడలేదు" అన్నాడు రెడ్డప్ప.

'మీ నాయనకు పెం డ్లయిన కొత్తలో ఎప్పుడో వెళ్లిపోయిన వాణ్ని, నిన్న సాయంత్రం మళ్లా అడుగు పెట్టినాను. నీకు నన్నెట్ల తెలిస్తిందిలే! భవబంధాలు తెంచుకుని సన్యాస దీక్ష తీసుకోని వెళ్లి పోయిన తర్వాత ఈ పక్కకు రావటం ఇదే!' ఎటో చూస్తూ మాట్లాడుతున్నాడు స్వామి.

రెడ్డప్ప ఘరో సారి ఉలిక్కిపడ్డాడు. ఒక్క సారిగా అతడి చేతులపైన వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. ఉన్నట్టుండి పెద్దగా దగ్గు ముంచుకొచ్చిం దతడికి. అతి కష్టం పైన గొంతు పెగల్చుకుని "కొంపదీసి ... నువ్వు మా నాయన తమ్ముడేనా ఏంది?" అంటూ మాటలు కూడ బలుక్కుంటూ ప్రశ్నించాడు.

మీసాలు సాగడం ద్వారా, గుబురు గడ్డం అటూ ఇటూ విడివడడం ద్వారా స్వామి చిరునవ్వు నవ్వుతున్నాడని తెలుస్తోంది.

"ఎప్పుడో ఇ ల్లొదిలిపెట్టి సన్యాసుల్లో చేరిపోయిన మా చిన్నాయన గురించి మావోళ్ల కతలు కతలుగా చెప్తా ఉంటే విన్నాను. అసలు చానా సమత్సరాల ముం దొకసారి ఎవురో ఎక్కడో సమారాధనలో కనబడినాడని కూడా మాతో చెప్పినారు. ఆ మధ్యొకసారి ఎవురో ఆ మనిషి ఇంకా ఎక్కడ బతికుండాడులే అని తేల్చిపారేసినారు!" మాట జారిన తర్వాత అతను నాలి క్కరుచుకున్నాడు.

"గుండు మాదిరి ఇంకా దిట్టంగా ఉండాను. నన్ను చూసినాక గూడా నమ్మకం కుదర్లేదా నాయనా?" అదోలా నవ్వసాగాడు స్వామి. "దేశ మంతా సంచారం చేసేసినానులే! గండి దగ్గిర ఆత్మానందాశ్రమంలోనే ఉండి పోయినాను చానా దినాలుగా!"

రెడ్డప్ప అనుమానంగానే చూడసాగాడు.

"సన్యాస దీక్ష తీసుకున్న కొత్తలో వొక అయి దేండ్లు మా గురువుతో బాటూ ఉత్తర దేశం పొయ్యుంటిని" అర మోడ్పు కన్నులతో చూస్తూ చెప్పసాగాడు స్వామి. "కాశీ, హరిద్వారం, ప్రయాగ, అన్నీ తిరిగి బీహారులో వొక ఆశ్రమంలో కొన్ని సంవత్సరా లుంటిని. తమిళనాడులో తంజావూరు దగ్గిర కొన్నేండ్లూ, రావూరు అన్నపూర్ణాశ్రమంలో కొన్నేండ్లూ ఉండి పోతిని. గండి ఆంజనేయస్వామి ఆజ్ఞ ఇస్తే అక్కడికి పోతిని. అక్కడ్నే మా గురువు నిరంజనాశ్రమం స్థాపిస్తే దాన్లోనే గడిపేస్తిని ఇన్ని దినాలుగా. పోయిన శ్రావణ పౌర్ణమినాడు మా గురువు శాశ్వత సమాధిలోకి వెళ్లిపోయినారు. ఆయన లేని చోటులో ఉండే దానికి ఈ జీవుడికి ఇష్టం కలగ లేదు. అప్పటి నుంచీ ఆ ఆశ్రమమూ, ఈ ఆశ్రమమూ అని లేకుండా తిరగతా ఉండాను.'
'

"మా అవ్వ పోయినప్పుడు కూడా రాలేదంట!' ' ఎదుటి వ్యక్తి అసలైన ఆచూకీ కనిపెట్టడం కోసం క్రాస్ ఎగ్జామినేషన్ మొదలుపెట్టాడు రెడ్డప్ప.

"తల్లీ, తండ్రీ ఈ దేహానికే నాయనా! అసలైన ఆత్మకు తల్లీ, తండ్రీ., గురువూ దైవం అన్నీ ఆ పరమాత్ముడే! ఆయన కంటిలో పడినాక ఇంక బతు కంతా ఆయన ధ్యానంలోనే! మన చేతుల్లో ఏముంది? అంతా మాయ!"

పెద్దగా శబ్దం చేస్తూ మిషను ఆగిపోవడంతో స్వామి మాట్లాడడం మాని, పూర్తిగా కళ్లు తెరిచి చూశాడు.

రెడ్డప్ప వెనుదిరిగి చూసి, "కరెంటు పోయింది మళ్లా!" అంటూ పైకి లేచి, దగ్గుకుంటూ మిషను వైపు నడవసాగాడు. స్వామి కూడా అతడినే అనుసరిస్తూ పొలం గట్టు పైన నడవసాగాడు.

"మిషను బిగించి ఎన్ని దినా లయింది?" అని ప్రశ్నించా డతను.

"మూడేం డ్లయింది. ఆ మూలలో జియాలజిస్టు నాలుగు పాయింట్లు పెట్టించినాడు. సమత్సరాని కొకటిగా మూడుచోట్ల బోరిం గేయించినాను. దగ్గిర దగ్గిర నలభై వేలు నష్టం. కడాకు ఈ పాయింటు దగ్గిర జల పడింది. వానా కాలంలో వొక మాదిరిగానే వొస్తాయి నీళ్లు. ఆ పైన ఈ మాదిరిగా నాలుగేళ్ల ఎడంతో పారతాది. నీళ్లు ఊరేది తక్కువ. అప్పు డప్పుడూ ఆపీ ఆపీ మిష నెయ్యాల. దానికి తోడు ఈ కరెంటుతో పెద్ద యాతన. ఎప్పుడొస్తిందో, ఎప్పుడు పోతిందో తెలియదు. రాత్రీ, పగలూ ఇక్కడ్నే కాపెట్టుకోని కరెం టొచ్చినప్పుడు నీళ్లు పారగట్టుకోవాల. కరెంటు సరిగ్గా లేక, నీళ్లూ సరిగ్గా రాక, నెల దినాలకు ముం దొక సారి తోట ఎండ పోతిందని ఆశ లొదిలేస్తిని. వొక పదును వాన కురవటంతో బతికి పోయినాం!'
' మిషను స్విచ్ ఆఫ్ చేశాక వెనుదిరిగాడు రెడ్డప్ప.

దుబ్బుగా పెరిగిన కనురెప్పల కింద పదునైన చూపుల్ని సారిస్తూ ఆగంతుకుడి కళ్లు రెండూ తనను నఖశిఖపర్యంతం పరీక్షించి చూస్తున్నట్టు గమనించగానే రెడ్డప్ప తడబడిపోయాడు.

"మీ నాయన ఊళ్లో లేడా?" అడిగాడు స్వామి.

"లేడు. హొస్పేటకు పోయినాడు!" రెడ్డప్ప చెప్పాడు.

"ఎక్కడికి కర్ణాటకలో బళ్లారి దగ్గి రుండే హొస్పేటకేనా?"


తల ఊపా డతను.

"అంత దూరంలో ఏం పని?"

"మామిడి కాయల వ్యాపారం. పోయి రెండు నెలలయింది. ఇంకా రెండు మూడు నెల లక్కడే ఉండాల!"

"మీరు ఎందురు సంతానం?"

"ముగ్గురు మొగోళ్లు, ఇద్దురు ఆడోళ్లు. మా అక్కకూ, చెల్లికి పెండ్లిం డ్లయిపోయి చానా సంవత్సరా లయిపోయింది. అక్కను దిగవపల్లెలో ఇచ్చినాం. చెల్లిని ఈ కొత్తూరులోనే అయినోళ్లకే



## వచ్చిన పూరణలలో అత్యుత్తమంగా ఎంపికైన పూరణలు పంపినవారు:

**1. సింహాద్రి శ్రీరంగము (బందలాయి చెరువు) 2. బందరు ఉమామహేశ్వరరావు (కవిటి) 3. కె. రాజేశ్వరరావు (పెనుకొండ).**

---

ఇచ్చినాం. మా అన్న, రాజగోపాల్‌కు కువాయిట్‌లో ఉద్యోగం. నా కంటే చిన్నోడు, రామచంద్రయ్య చిత్తూరులో ఉద్యోగం చేస్తా ఉండాడు - క్లర్కు."

'అందరికీ పెండ్లిం డ్లయినాయా, నాయనా?'

"మా రాజగోపాలన్న భార్యాబిడ్డ లిద్దరూ వాళ్లత్తగారిల్లు పాకాల చేరిపోయినారు. ఆయన ఒంటిగా ఉద్యోగం పైన కువాయిట్‌కు చేరి అయిదా రేండ్లవతా ఉంది. అప్పటి నుంచీ నెల నెలా దుడ్డు పెండ్లానికే పంపిస్తా ఉండాడు. ఆమె ఆ దుడ్డు దగ్గిర పెట్టుకోని కొడుకు లిద్దుర్నీ చదివించుకుంటా ఉంది. మా తమ్ముడు పెండ్లాడింది అరగొండలో. కాపరం చిత్తూరులోనే. వాడికీ ఇద్దురూ కొడుకులే! కాన్వెంటులో చదవతా ఉండారు. ఈ పల్లె కొంపల్లో ఉండే గుడిసె స్కూల్లో చదవాలని నా బిడ్డలకూ, ఈ మట్టిలోనే పొర్లాడాలని నాకూ రాసి పెట్టి ఉంది!" మరో పెద్ద దగ్గు తెర ముంచుకురాగా చివర్లో అతడి గొంతు కీచుకీచుగా పలికింది.

"నువ్వు కూడా బాగా చదువుకోని ఉద్యోగం చేసుకోనుంటే ఎవు రొద్దన్నారు?" నిర్వికారంగా ప్రశ్నించాడు స్వామి.

"నేనూ చదివాన్లే ఎమ్మే దాకా! ఉద్యోగం రావాలంటే చదు వుంటే సరిపోతుందా?" మౌనం బెరుకుతనాన్ని పెంచుతోందని అర్థం కాగానే రెడ్డప్ప మరింత విపులంగా వివరించసాగాడు- "బియ్యాడీ చేస్తే బిన్నాగా ఉద్యోగ మొస్తిందని అందురూ అంటా ఉంటే అణ్ణామలై యూనివర్సిటీకి కరస్పాన్డెన్సు కోర్సు కట్టయి చేసినాను. ఒక సంవత్సరం కోర్సు మూడేండ్లు సాగింది. ప్రయివేటుగా ఎమ్మే చేస్తే అది మూడేండ్లకు నీల్గింది. ఇంతలో మనకేమో పెండ్లి మీద ధ్యాస మళ్లింది. పెండ్లయినాక ఇంక చదువులూ సాములూ అచ్చిరాలేదని ఈ మట్టి పిసుక్కునే పనిలోకి దిగేసినాను!"ఖణేళ్ ఖణేళ్ మని దగ్గుతూ తన మాటల్ని పూర్తి చేశాడు రెడ్డప్ప.

ధోరణి మరల్చడం కోసం "ఈ మడిలో చెరు కెందు కేసినావు? వరి నాటకూడదా?" అని అడిగాడు స్వామి.

"పోయిన స్సారి వరి పైరే బెట్టినాను సా...మీ...! అదేందో కొత్త పంగడ మొచ్చింది. బాగా ఫలిత మొస్తాదని అందురూ అంటే అదే నాటితిని. సరిగ్గా నీళ్లు లేక సగం పంటే చేతి కొచ్చింది. అందుకని ఈసారి చెరు కేసినాను. అసలు ఈ బోరిం గేయక ముందు ఇక్క డంతా చేనే చేస్తా ఉంటిమి. నాలు గైదేండ్లు చెనిక్కాయ లేసినాము. పెట్టిన ఖర్చుతో పోలిస్తే ఆదాయం చానా తక్కువ. ఒక సంవత్సరం మల్బరీ చెట్లు పెంచి పట్టు పురుగులు కూడా పెంచినాను. ఈ ఎండలకు తట్టుకోలేక పురుగు మాడి పోయినాయి. అయిదారు వేలు నష్టం. ఒక సారి పొద్దు తిరుగుడు పూల పంట పెట్టినాను. అనుకున్నంత వొరుమానం రాలేదు. ఇంక ఇట్లా కాదని ఈ సారి చెరు కేసినాను. మిల్లుకు తోలే దాని కంటే గాని గాడిస్తే లాభసాటని వాళ్లూ వీళ్లూ చెప్తా ఉండారు. నే నింకా ఏమీ అనుకో లేదు."

మామిడి తోటలోకి అడుగు పెట్టా రిద్దరూ.

"నాకు తెలిసి ఇన్ని చెట్లు లేవు. కాత బాగానే ఉంది కదా ఈ సారి?" చుట్టూ కలయజూస్తూ అడిగాడు స్వామి.

"అయి దారేండ్లుగా ఎవురికీ తోట అమ్మడంలేదు. ఇప్పుడు మా నాయనే వ్యాపారం మొదులుపెట్టినాడు దా! నేనే దగ్గిరుండి మందులు కొట్టించినాను. మంచు పురుగులు సంగ పూతను తినేసినాయి. అర్ధపంటే నిలిచింది. ఈ సంవత్సరం ఏం చూసినావులే! పోయిన తడవ భలే పంట! కాయల బరువుకు తట్టుకోలేక కొమ్మలే ఇరిగి పోయినాయి. కానీ ఏం లాభం? రేటు లేదు. అంతకు ముందు తడవ అయిదు టన్నులే వచ్చింది పంట. బ్రహ్మాండమైన రేటు. ఈసారి పది టన్నులకు తగ్గదని మతిం పేసినాను. అంతా పూతా, పిందెగా ఉంది. ఇంకా కొన్ని దినాలు పోతే కానీ ఏ సంగతీ చెప్పలేం!"

"చెట్లుకు సరిగ్గా నీళ్లు కట్టేటట్టే లేదు. పాదులు చేసిన చాయలు కూడా కనిపించటం లేదే!" అడ్డు తగులుతూ అడిగాడు స్వామి.

"చెరుకు తోటకే నీళ్లు చాలడం లేదు. ఇంక మామిడి చెట్ల కెక్కడ నుంచి తెచ్చేది?" విసుక్కున్నట్టుగా సమాధానం చెప్పాడు రెడ్డప్ప.

"ఈ పక్క నొక బంగినపల్లి మామిడి చెట్టుండాల ... ఎక్క డది?" స్వగతంలా గొణుక్కున్నాడు స్వామి.

"ఇదే గదా!" ఓ చెట్టు ఆకులు పట్టి చూపుతూ అన్నాడు రెడ్డప్ప.

స్వామి అతడి నోసారి ఎగాదిగా చూసి, "ఇది పీతర్! బంగినపల్లంటే ఈ పక్క బేనీషా అంటారు. దాని ఆకులు ఇ ట్లుండవు. లావుగా, పొడుగ్గా ఉంటాయి" అంటూ నవ్వాడు."అప్పటి నుంచీ చూస్తా ఉండాను. ను వ్వీ వ్యవసాయానికి లాయికీగా కనిపించటం లేదు. సమత్సరాని కొక సారి పంటల్ని మార్చి అదృష్టం లెక్క బెట్టుకుంటే గుణం లేదు. చేసే పని మీద మనసు పెట్టి చేస్తే ఏదైనా కలిసొస్తింది!"

నడుస్తున్న వాడల్లా ఆగి నిల్చుని, వెనుదిరిగి నడుము పైన చేతులుంచుకుని "ఈ పక్క నా కంటే బాగా సేద్యం జేసేవాణ్ని చూపించు సామీ నీ వల్లయితే!" అని హుంకరించాడు రెడ్డప్ప. "ఈ పక్క నా మాదిరిగా చదువుకోని సేద్యానికి దిగిన మొగోడే లేడు. అంతా మొరుటు రకం. వేలి ముద్దర్ల మనుషులు. ఈ ఇలాకాలో తొలీ సారిగా పొద్దు తిరుగుడు పూలు నాటిం దెవురు? నేనే! సెరీ కల్చర్ సాగుజేసో డెవుడు? నేనే! చూస్తా ఉండు. ఈ చెరుకు తోట కొట్టేస్తానే తక్కాళి తోట పండబెడతాను. ఈసారి టన్నుకు కేజీ టమేటోలు ఎంతో తెలుసునా? ఇరవై అయిదు రూపాయలు. ఈ సారితో దరిద్రం తీరి పోక పోతే అప్పు డడుగు నన్ను! ఆ వీడీవో కొత్తగా ఏందో మం దొచ్చిం దన్నాడు. దాన్ని కొడ్తే టమాటోలు విరగ కాస్తాయని చెప్తా ఉండాడు. ఈ పదేండ్లుగా ఈ రెం డెకరాల మడితో నే నాడని ఆట లేదు. ఈ ఏ డెకరాల తావులో నా చెమట చిందని చోటు లేదు. బాంచెత్! లోపం నాలో లేదు పెద్దాయనా! ఈ తావులోనే ఉంది. ఇన్ని దినాలుగా అగసాట్లు పడతా వుండాను గదా! కష్టం జాస్తి, ఫలితం కొంచెం. ఆ మామిడి తోపులో చెట్లు బాగా ముసిలి వై పోయినాయి. కొట్టేద్దా మంటే పెద్ద పెద్ద చెట్లు గదా అని మినకరిస్తా ఉండాము. ఆ లే దోటలో చెట్లు నాటి ఆరేం డ్లయి పోయింది. చెట్లు సరింగా ఎదగటం లేదు. కన్నగసాట్లూ పడి బోరిం గేసి చేనును మడిగా తీరిస్తిని. ఏం లాభం కనపడ్డం లేదు. అయినా ఇది గాదులే దొవ. ఈమధ్యనే కొత్తగా వొక అయిడియా ఏసినాను. చూస్తా ఉండు ఏం చేసిపారేస్తానో!"

కుతూహలాన్ని వీలైనంతగా తగ్గించుకోడానికి ప్రయత్నిస్తూ "ఏం చేస్తావు?" అని ప్రశ్నించాడు స్వామి.

"మంచి బేరం తగిలితే దొంగ ల్దోలిపారే ద్దామనుకుంటా ఉండాను."

"ఏదైనా వ్యాపారంలోకి దిగదామనా?"

"నే నంత బిన్నాగా చేతు లెత్తేసేవాణ్ని గాదులే సామీ!" నవ్వుతో బాటూ దగ్గూ కలిసి రాగా గొంతు రాసినట్టుగా మాట్లాడసాగా డతను.

"ఈ వ్యవసాయమో, నేనో - ఏదో ఒకటి తేలి పోవాల. మా బామ్మర్ది వాళ్లుండేది కాళాస్త్రి కాడ కృష్ణాపురం. అక్కడ భూములు భలే అగ్గవ. వానలు బాగా జాస్తి! కాలవల్లో, చెదువుల్లో నీ ళ్లెప్పుడూ ఉంటాయి. బాగా నిమ్మళమైన భూములు. ఇక్కడ అమ్మిన దుడ్డుతో అక్కడ ఇంకా పెద్ద కయ్య కొనుక్కో వచ్చు. బేరానికి పెట్టేయ్యాలని ఇంకా మా నాయనకు చెప్పలేదు. ఆయ నెప్పుడూ ఈ భూమి బబుర్రా అంటే పెద్ద రోత. వొద్దనడని నాకు తెలుసు."

తోట దాటి రాళ్ల గుట్ట దగ్గిరి కొచ్చినాక చిన్న వేప చెట్టు నీడలో పెద్ద బండ పైన కూర్చున్నా రిద్దరూ. ఎండలో కాగిన బండలు ఇంకా వేడిగానే ఉన్నాయి. తోట లోంచి ఏవేవో పక్షుల కీచుకీచు గొంతుకలు వినవస్తున్నాయి. దూరంగా ఏదో గూడ్సు రైలు పట్టాల్ని వేల్కొల్పుతూ పరుగెడుతోంది. పడమటి కొండల కిందుగా జారిపోబోయే ముందు సూర్యుడు ఓ సారి వెనుదిరిగి సాగివచ్చిన దూరాన్ని పరిశీలిస్తున్నాడు.

"మీ అన్నదమ్ము లందురూ అమ్మే దానికి ఒప్పుకుంటారా?" స్వామి అడిగాడు.

"వాళ్ల అభ్యంతర మేముంటాదిలే సామీ! మా అన్నకు కువాయిట్‌లో మంచి సంపాదన. ఆయ న్నెక్కడ దుడ్డడగతామో అని ఆయన భయం. మా తమ్ముడు టౌ నొదిలిపెట్టి క్షణం బతక లేడు. ఈ పల్లె కొంప లంటేనే వాని కంపరం. వా ళ్లిద్దరికీ సేద్యా లేమీ కాబట్టవు!" అన్నాడు రెడ్డప్ప.

కాస్సేపు ఆలోచించి, "వా ళ్లొప్పుకోకపోతే ఏం చేస్తావు?" అని అడిగాడు స్వామి.

"ఒప్పుకోకపొయ్యే దానికి వాళ్లెవురు?" కోపంతోనూ, దగ్గుతోనూ ఉక్కిరిబిక్కి రవుతూ రెడ్డప్ప శివమెత్తిన వాడిలా ఊగిపోసాగాడు. "ఈ నేల ఊరికే దిక్కులో ఉం దనయినా వాళ్లకు తెలుసునా? ఒక దినమైనా వా ళ్లిద్దురూ ఈ నేల దగ్గిరి కొచ్చి నిలబడినారా? కూడా పుట్టినంత మాత్రాన వాళ్లకు కూడా అధికార మొచ్చేస్తిందా? ఇంత కాలం ఈ నేలలోనే పడి దుమ్ముగొట్టుకు పోయి నోడి కంటే వా ళ్లేమైనా గొప్పోళ్లా?"

అయిదారు నిముషాలు గడిచినా రెడ్డప్పకు గసబుసలు తగ్గలేదు. బీడీ రగిలించి గబగబా పొగ పీల్చి వదిలిపెట్టసాగాడు. కొంచె తెప్పరిల్లిన తర్వాత మెల్లగా మొదలెట్టాడు - "మా అన్నను కువాయిట్‌కు పంపించే దానికి ఆ దినాల్లోనే యాభై వేలయింది. మా తమ్ముడికి ఉద్యోగం తీసిచ్చే దానికి అరవై వేలయింది. అంతా ఉమ్మడి ఆస్తే గదా? ఆ మాత్రం ఖర్చు నా పైనా పెట్టుంటే నేనూ సిల్కు చొక్కా ఏసుకోని, స్కూట రెక్కి ఒయ్యారంగా ఆఫీసుకు పోయి గంట గొట్టంగానే బయటి కొచ్చి, నెలకు ముప్పయి దినాలు లెక్కబెట్టుకోని, జీతం దుడ్డు జేబులో ఏసుకోనుందును గదా! మా నాయన కూడా వలపక్షం పెట్టుకోకుండా వాళ్లను జూసిన కంటితో నన్నూ చూసుంటే, ఈ పల్లె కొంపల్లో కూరుకపోవాల్సిన గాచ్చారం నాకూ తప్పుండును. అసలు ఆ పల్లెలో ఉండే దాని కంటే ఈ తోటలోనే ఇల్లు కట్టుకోనుంటే బాగుండును. కాళాస్త్రి కాడ కయ్య కొనుక్కున్నాక తోపులోనే ఇల్లేసుకోవా లనుకుంటా ఉండాను. అప్పుడు గానీ సేద్యం సుఖం గాదు!"

అంత వరకూ కొడిగట్టిన దీపాల్లా వెలవెలబోయిన అతడి రెండు కళ్లూ ఉన్నట్టుండి తీక్షణంగా వెలగసాగాయి. దూరంగా పడమటి కొండల సానువుల కవతల దేన్నో అతడి చూపులు వెతుకు లాడుతున్నాయి. ఏదో కొత్త శక్తి ఆవరించినట్టుగా అతడి శరీర మంతా వణక సాగింది. కంపిస్తున్న గొంతుకతో తనతో తానే మాట్లాడు కుంటున్నట్టుగా అతడు చెప్పుకుపోసాగాడు - "నీళ్లతో నెమ్మెక్కి శాంతంగా ఉండే మడి చెక్క రెం డెకరాలు. ఇరవై నాలు గ్గంటలూ కొట్టినా వేలి వాసమయినా తగ్గని బోరిం గొకటి. సక్రమంగా దున్ని పాదులు జేసి నీళ్లు గట్టితే మంచి కాత గాసే మామిడి తోట అయి దెకరాలు, గొడ్డూ గోదా... వానొచ్చినా వంగి డొచ్చినా బయుం లేకుండా ఇల్లు ... పెండ్లానికీ, బిడ్డలకూ కూడుకూ, గుడ్డకూ తక్కువ చెయ్యకుండా ఫలసాయం ... ఈ మాత్రం పనయినా ఈ కట్టెలో శక్తి ఉడిగే లోపల చేసి పెట్టి పోవాల. బిడ్డలు మా నాయన మా కేమీ తక్కువ జేసిపెట్టిపోలేదు అని పది కాలాలూ నా పేరు చెప్పుకోవాల. అంత వరకూ ఏది ఏమైనా ఈ పట్టు వదిలేది లేదు, బాంచెత్! చూడాల, నేనో, ఈ సేద్యమో! తేల్చిపారేయాల!"

అతడి పిడికిళ్లు బిగుసుకున్నాయి.

నుదుటిపైన ముడతల ముళ్లు చెదిరాయి.

చెవుల కిందుగా చెమట ధారొకటి గొంతు వైపు సాగింది.

స్వామి అతడి వైపే కళ్లార్పడం సైతం మరచిపోయి చూడసాగాడు.


ఇద్దరూ అలాగే కాస్సేపు మాట్లాడుకోకుండా మౌనంగా చూస్తూ ఉండి పోయారు.

తరువాత స్వామి పైకి లేచి, కాషాయాంబరాని కంటుకున్న పల్లేరు గాయల్ని విదిలించుకుంటూ, "నేను బయల్దేరతాను నాయనా! వయస్సు ఎగబడింది గదా! చూపు కొంచెం మట్ట మయింది. చీకటి పడక ముందే ఆశ్రమం చేరుకోవాల. నడవాల గదా!" అన్నాడు.

"ఆ పక్క దోవ సరిగ్గా లేదు సామీ! ఉండు, నేనూ అందాకా వస్తాను. ఈ కరెం టిప్పుడిప్పుడే వచ్చేట్టు లేదు. ఈ పొద్దు రాత్రికి జాగారం తప్పేట్టు లేదు. నేనూ ఇంటికి పోయి రెండు మెతుకులు గతికేసి వస్తాను!" అంటూ తానూ బయలుదేరాడు రెడ్డప్ప.

"రాత్రికి మళ్లా వస్తావా? అయితే ఇంటికి పోయి పడుకునే దెప్పుడు?" అని అడిగాడు స్వామి.

"పదై ద్దినాలుగా రాత్రుల్లో మన పడక ఈ తోట కాడనే గదా! ఇంకో వారం దినాలు కాపెట్టుకో



## సాహస బాలలు - 8



# ఎలుగు గొడ్డును తరిమికొట్టిన సాహసి రంగైసంగ

1995 డిసెంబరు మొదటి వారంలో మిజోరాంలోని బౌర్‌పుయ్ గ్రామానికి చెందిన చాందమా, ఆయన పదేళ్ల కుమారుడు రంగైసంగతో కలసి పంటకోతల సమయం కాబట్టి ఊరి బయటనున్న తమ పొలం పాకలో ఉన్నారు. డిసెంబర్ ఎనిమిదవ తేదీన వాళ్లిద్దరూ ఆ పక్కనే ఉన్న అడవిలోకి కట్టెలకోసం వెళ్లారు. అంతలో హఠాత్తుగా ఒక ఎలుగుబంటి దూసుకుంటూ వచ్చి చాందమా పైన బడి క్రూరంగా రక్కసాగింది. అది చూసిన రంగైసంగ తనవద్ద నున్న ఇనుపకడ్డీతో ఆ క్రూరమృగాన్ని తన బలాన్నంతా పుంజుకుని ఆగకుండా దబదబా మోదడం మొదలుపెట్టాడు. ఎదురు దాడిని తట్టుకోలేక, ఆ ఎలుగుగొడ్డు తోక జాడించింది. ఆలోగా వాళ్ల అరుపులు విని చుట్టుపక్కల పాకలలో ఉన్న రైతులు అక్కడ గుమిగూడారు. వాళ్లంతా గాయాలతో పడి ఉన్న చాంద్‌మాను సాయంపట్టి స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చగా, అతడు 12 రోజుల చికిత్స అనంతరం పూర్తిగా కోలుకోగలిగాడు.

పదేళ్ల బాలుడు రంగైసంగ (బాపు గయాధని అవార్డు గ్రహీత) సాహసం, సమయస్ఫూర్తి ప్రదర్శించి తన తండ్రి ప్రాణాలను కాపాడగలిగాడు.

Ⓟ అనిపెద్ది వెంకట రమణరావు

---

నుండాల. ఈ గుట్ట దగ్గిర గుంత నక్కల పోటుకు జాస్తీ. ఏమారితే గుములు గుములుగా చప్పరించి పారేస్తాయి. రాత్రుల్లో తోడుగా ఉండ దానికి సేద్యగాణ్ని కూడా రమ్మన్నాను!'' మాట్లాడుతూండగానే రెడ్డప్పకు దగ్గు తోసుకొచ్చింది. దగ్గుతూనే బీడీ వెలిగించి, "పొద్దన్నెప్పుడో ఇ ట్లొచ్చేసినాను. మధ్యానం భోజనం తోట కాడికే వచ్చింది. కువాయిట్ నుంచీ మా అన్నొచ్చినాడని జాబొచ్చి రెండు దినా లయింది. ఈ పొద్దో, రేపో ఇంటికి రావాల!''

"ఇప్పు డెక్కడున్నాడు మీ అన్న?'' స్వామి అడిగాడు.

"ఇం కెక్కడ? వాళ్లత్త గారింట్లో! పాకాల కొచ్చి వారం దాటిందంట. కువాయిట్ నుంచి వచ్చి పొయ్యి రెండు నెలలు కూడా కాలేదు. ఈ సారి సమత్సరాని గ్గానీ రానని చెప్పేసి పోయిన పెద్దమనిషి, ఇంతలోనే తిరుక్కొచ్చి...డు. ఏమైనా దుడ్డెక్కువగా దొరికితే పెండ్లాని కిచ్చేసి పోదామని వచ్చుంటాడు!'' మట్టి బాట పైకొచ్చాక ఆగాడు రెడ్డప్ప.

"నువ్వు ఇంటికి పోవాల గదా! నేనూ ఆశ్రమానికి పోతాను. ఇంకా కొంచెం వెలుతురుంది. వెళ్లి పోగలనులే! మీ అన్నొస్తే ఇద్దురూ ఒకసారి ఆశ్రమం దగ్గిరికి వచ్చి పొండి. విమల ప్రకాశానంద స్వామి అని అడిగితే ఎవురైనా చూపిస్తారు!'' తన గమ్యం వైపు తిరుగుతూ చెప్పాడు స్వామి.

"విమల ప్రకాశానందస్వామా? అ దెవురు?'' రెడ్డప్ప విస్తుపోయాడు.

'నేనేలే! దీక్ష తీసుకున్నాక మా గురువు చిరంతానంద స్వాములవారు ఆ పేరు పెట్టినారు' ' నడుస్తూనే సమాధానం చెప్పాడు స్వామి.

పెద్దగా దగ్గు తోసుకురావడంతో నిలువునా కదిలిపోతూ ముందుకు కదిలాడు రెడ్డప్ప.

పలచగా వ్యాపిస్తున్న చీకటి తెరల్లో రకరకాల ఆకారాల రాళ్లతోనూ, బొమ్మజెముడు పొదల్తోనూ భీకరంగా కనిపిస్తున్న రాళ్ల గుట్టలు రెండూ ఏదో ఆటవిక జాతి వాళ్ల దేవత ముఖంలా భీకరంగానూ, తోటా, పొలమూ ఆమె నోటి లోంచి జారిన పచ్చని నాలుక లాగానూ చిత్రంగా కనిపిస్తున్నాయి.

## - 2 -

తూర్పు కొండల వల లోంచి సూర్యు డింకా బయట పడలేదు.

రాత్రంతా పర్వతాలు కన్న కలలకు ఆకారం వచ్చినట్టుగా ఆకాశంలో అక్క డక్కడా మేఘాలు కదులుతున్నాయి.

మట్టి బాట దాకా నడచి వచ్చిన తర్వాత, మామిడి తోట కేసి తిరిగి నిల్చున్నాడు విమల ప్రకాశానంద స్వామి.

మామిడి చెట్ల గుబురుల్లోంచి రాళ్ల గుట్టలు రెండూ తమకు ఆహారంగా మారబోయే చిన్న చిన్న జంతువుల పైకి దుముకడానికి సిద్ధ మౌతూ పొదల్లో నిక్క కూర్చున్న క్రూరమృగాల్లా కనిపిస్తున్నాయి.

దాదాపు తన వయ సున్న మామిడి చెట్లని చూపులతోనే పలకరిస్తూ తోటలోకి అడుగు పెట్టా డతను.

అక్క డక్కడా చెట్ల ఆకుల్లోంచి చిన్న చిన్న పిందెలు తొంగి చూస్తున్నాయి. నీ ళ్లెండి పోయిన చెరువులా బోసిగా ఉంది మడి. కాలి బుగ్గయిన చెరుకు మొదళ్లతో, ఆకులతో నల్లగా తయారైన మడి అవశేషాలు, కూలిన భవనపు శిథిలాల్లా వికృతంగా కనిపిస్తున్నాయి. తో కొక చివర చిన్న గుడిసె లాంటి ఆశ్రయం కనిపించింది. దాని ముం దొక చిన్న కుక్కి మంచం. దాని పైన కూర్చున్న వ్యక్తి కాషాయంబరధారిని చూడగానే తటపటాయిస్తూ పైకి లేచి నిల్చున్నాడు.

పొడుగ్గా, ఎరుపో నలుపో తెలియని రంగుతో, ఇంకా చేవబారని కొయ్యతో చెక్కిన బొమ్మలా బలహీనంగా కనిపిస్తున్న ఆకారం అతడిది. విరిగిన చేతికి కట్టు కట్టుకుని, దాని కో దారం కట్టి మెడకు తగిలించుకున్నాడు. తొడుక్కున్న సిల్కు బట్టలు, దారి తప్పి పొలానికి వచ్చేడేమో నన్న సందేహాన్ని కలిగిస్తున్నాయి.

అతడు పలకరిస్తాడేమో నని ఎదురు చూసి, విఫలుడై, చివరకు తానే "రెడ్డప్ప లేడా?'' అని ప్రశ్నించాడు స్వామి.

అయస్కాంతాన్ని అంటిపెట్టుకున్న ఇనుప రజనులా ఉన్న గడ్డపు వెంట్రుకలు చిత్రంగా ఒంగుతుండగా అతడి పెదవులు సాగాయి. ఇక సమాధానం రాకపోవచ్చునని ఎదుటి వ్యక్తి బెంబేలు పడిపోయిన తర్వాత, మెల్లగా "లేడు. కూర్చోండి!' ' అన్నా డతను ముక్తసరిగా.

ఒకటి రెండు నిముషాలు తటపటాయించిన తర్వాత మంచం పైన కూర్చున్నాడు స్వామి. కాషాయ వస్త్రపు కొంగుతో నుదుటి పైన పొటమరించిన చెమట బిందువుల్ని తుడుచుకుంటూ, "మన దే వూరు నాయనా?'' అని అడిగాడు.

వీలైతే నువ్వే తెలుసుకో చూద్దామని పోటీకి సిద్ధమైనట్టుగా మరి కాస్సేపు నిశ్శబ్దాన్ని నిగుడించి, ఊరించి, "ఈ ఊరే లెండి, రెడ్డప్ప మా తమ్ముడే!' ' అన్నాడతను.

"అనుకుంటిని చూసినప్పుడే. రెడ్డప్ప కంటే కొంచెం పొడుగ్గా ఉండావు. రంగు కూడా ఒక

చాయ ఎక్కువే! నువ్వే కదా ఖువాయిట్ నుంచి వచ్చింది? నీ పేరు" తటపటాయిస్తూ ఆగాడు స్వామి.

"రాజగోపాల్. మీ రీ వూ రొచ్చినారని మా తమ్ముడే చెప్పినాడు" మంచాని కో చివర సర్దుకుంటూ అన్నాడు రాజగోపాల్.

"చెయ్యి కేమైంది నాయనా?" స్వామి అడిగాడు.

"చిన్న యాక్సిడెంటు" రాజగోపాల్ సమాధానం చెప్పాడు.

"ఎప్పుడు?"

"నెల దినాలకు పైగా అయింది లెండి! మొదుటి కట్టు కువాయిట్‌లోనే ఏసుకున్నాను. రెండోదీ, మూడోదీ పుత్తూరులో. పోయిన సోమవారానికే ఇప్పేసెయ్యాల్సింది. ఒక దినం తీరిక దొరికితే పోయి విప్పించుకోని వచ్చేయచ్చు. కుదరడమే లేదు. మా తమ్ము డొచ్చి రిలీవ్ చేసే వరకూ ఈ కట్టుతో పోరకలాడాల్సిందే!" స్వగతంగా గొణుక్కోసాగాడు అతను.

"రెడ్డెప్ప ఎక్కడికి పోయినాడు?"

విహారయాత్ర కెళ్లా డన్నంత మామూలుగా "హాస్పిటల్‌కు" అన్నాడు రాజగోపాల్.

అదేమీ ఎదురు చూడని వార్త కాదన్నంత తాపీగా "ఎప్పుడు?" అని అడిగాడు స్వామి.

"పద్దైదు దినాలయింది నిన్నటికి. ఇరవై దినాలప్పుడు వచ్చినప్పుడే చిలక్కు చెప్పినట్టుగా చెప్పినాను, పగులనకా, రేత్రనకా చెరుకు తోట కాడ పడి పొర్లాడద్దురా అని. లాభం లేక పోయింది. అయినా మనిషికి మొంతమైన ఆశ ఉండకూడదు. సామీ! మన తోకెంతో అంతే ఆడించాల. ఒళ్లెరగని శివం తప్పు గదా! నాలుగు నెలలకు ముందు పోయిన మార్చి నెలలో వచ్చినప్పుడే ఆస్పత్రికి పోయి చెకప్ చెయ్యించుకోమని చెప్పినాను. ఇక్కడేందో పొర్లిపోతా ఉండాదని చెప్పినావు. తీరా బండి కదలనని మొరాయించినాక ఆస్పత్రికి పోయినావు. ఇప్పు డేమయింది? డాక్టర్లు రోగానికి అదేందో మూరెడు పొడుగు ఇంగ్లీషు పేరు పెట్టినారు. ఊపిరితిత్తులు బొత్తిగా పనికి రాకుండా పోయినాయని తేల్చి పారేసినారు. ఎప్పుడు డిశ్చార్జీ చేస్తారో కూడా చెప్పకుండా బెడ్డుకు కట్టి పారేసినారు!" చెప్పుకోడాని కో వ్యక్తి దొరకడంతో తన అక్కసునంతా వెళ్లగక్కసాగాడు రాజగోపాల్. "ఒళ్లు కూడా మనిషి మాదిరే గదా సామీ! సేద్యగాణ్ని పెట్టుకుంటే ఖర్చయితిందని తరిమేస్తివి. సేద్య మంటే ఇద్దురు ముగ్గురు మనుషులకు ఇరవైనాలు గ్గంటల పని. పంట చేతికి రాక ముందే రూకలు లెక్కబెట్టుకోని దానితోనే కడుపు నింపుకుంటివి. తిండీ, నీళ్లూ పట్టించుకోకపోతివి. ఇప్పుడు ఆస్పత్రిలో హాయిగా రెస్టు తీసుకుంటా ఉండావు. నన్ను ఇక్కడి నుంచి కదలనీకుండా చేస్తే నాకు జరిగే దెట్లా? అది చెప్పు?"

తననే రెడ్డప్పయినట్టుగా ఊహించుకుని తననే సూటిగా ప్రశ్నించడంతో స్వామి కంగారు పడిపోయాడు.

"మొన్నటికి మొన్న రోడ్డు పైకి లారీ వొచ్చి నిల్చుకుంది ..." చీకాకుతో ముడతలు పడ్డ ముఖాన్ని అవతలికి తిప్పుకుంటూ రాజగోపాల్ చెప్పసాగాడు - "చెరుకు కొట్టేదానికి మనుషులు దొరక్క ఆరు గంటలు లేటయింది. లారీ బాడిగ పెరిగి పోయింది. ఫాక్టరీ కాడికి పోయి చూస్తే యాభై, అరవై లారీలు వెయిటింగులో ఉండినాయి. నీ వంతొచ్చే కాడికి పది గంటలు లేటు. వాళ్ల దేం పోయింది? గంట గంటకూ నూర్లు నూర్లుగా వెయిటింగు చార్జీ వసూలు జేసినారు. నువ్వు పెట్టిన పెట్టుబ డెంత? వచ్చిన ఆదాయ మెంత? నాలుగు వేలో, అయిదు వేలో ఎక్కు వొచ్చిందే అనుకో! ఇప్పుడు ఆస్పత్రి ఖర్చు అంతకు రెండు మూడు రెట్లు అయిపోయింది గదా! అందుకే ఈ మడీ గిడీ వద్దు! బుద్ధిగా మామిడి చెట్లు పెట్టెయ్యి. అయి దారేండ్లలో కాపు కొచ్చేస్తాయి. నువ్వు ఇంట్లో కాలు మీద కాలేసుకోని కూర్చున్నా ఒరుమానం తగ్గదు అని చెప్పినాను. వింటివా? ఇప్పుడు అనుభవించు!"

బలవంతంగా ఎవరో ముందుకు నెట్టినట్టుగా సూర్యుడు కొండల పైన తొంగి చూస్తున్నాడు. ఆకాశంలో పక్షుల గుం పొకటి ఎక్కడికో వలసపోతోంది.

మామిడి తోట కవతల ముళ్ల కంచెల దగ్గర ఎండుటాకులు నలుగుతున్న శబ్దం వినిపించింది.

రాజగోపాల్ ముందుకు ఒంగి చూసి, "ఈ షుక్కూర్‌గాడు ఒంటిగానే అగోరిస్తా ఉండాడు. ఈ పొద్దు కూడా ట్రాక్ట రొచ్చేటట్టు లేదు!" అంటూ విసుక్కున్నాడు. "ఇందుకే ఈ తగరారు ప నొద్దంటే వాడు వినడు. కానరాని దేశం నుంచి వచ్చి నెలయింది. ఇంటి కాడ పెండ్లాం బిడ్డలతో ఉనిందేమో వారం కూడా లేదు. పది దినాలుగా ఆస్పత్రి కాడనే అల్లాడినాను. నాలుగు నాళ్లుగా ఒకటే పట్టు పట్టేసినాడు. అదును పోతా ఉందంట. మడి దున్నేసి టమేటా నారు పొయ్యాలంట! ఆ పని దగ్గరుండి నేనే చెయ్యించాలంట! అప్పటికి నా కింకేమీ పనే లేనట్టు, నాకో బతుకే లేనట్టు ...!"


దగ్గరికి వచ్చిన తర్వాత నడక వేగాన్ని పెంచుతూ, "టాక్టరు రాలేదన్నా!" అని వాకబు చేశాడు షుకూర్.

నన్నగా, పొడవాటి మెడతో చొక్కా తొడుక్కున్న జిరాఫీలా విచిత్రంగా కనిపిస్తున్నా డతను. ఇప్పు డిప్పుడే మొలుస్తున్న మీసమూ, గడ్డమూ వర్షాలు కురవక అదును తప్పిన పొలంలోని పంటలా పలచబారి ఉన్నాయి.

"వాళ్ల ఇంటి కాడికి పోతే టాక్ట రెత్తుకోని తెల్లారి జామున్నే కృష్ణారెడ్డి ఎలబారిపోయినాడని చెప్పినారు. ఈడికే వచ్చుంటాడని అనుకుంటినే!' ' అంటూ సాగదీశాడు షుకూర్.

"గల్ఫో గల్ఫో అంటావు. ఇంత ఒళ్లయ్యా గాకుండా పనులు చేసే వాణ్ని తొడుక్కోనిపోతే వాళ్లు నా ముఖాన్నే కారి ఊంచేస్తారు!" రాజగోపాల్ ముఖం మొటమొటలాడసాగింది.

"తప్పు నాది గా దన్నా! నీ కంత కోపమైతే ఎట్ల?" షుకూర్ గింజుకోసాగాడు. "నిన్న కృష్ణారెడ్డి వాళ్లింటి కాడికి పోయి కాపేసుకోని కుచ్చుంటిని.



అంతా దున్నుకాల రోజులు. ఈ ఊళ్లో ఉండేది రెండో మూడో ట్రాక్టర్లు. గిరాకీ ఎక్కువ. నిన్నంతా ఆ తూరు ప్రక్క దున్నే దానికి పోయి రాత్రి ఎనిమిది గంటలకు ఇంటి కొచ్చినాడు. లక్ష రకాలుగా చెప్పే సొచ్చినాను. కావాల్లంటే అయిదో, పదో ఎక్కువగా ఇస్తానని కూడా మా టిచ్చినాను. వస్తాననే నమ్మకంగా చెప్పినాడు. ఇప్పుడో, ఇంకొం చేపుటికో వచ్చినా రావచ్చు!'

"నాలుగు దినాలకు ముందు ఆస్పత్రి కాడి కొచ్చినప్పుడే చెప్పినాను గదా నీకు. నేను ఊరికొచ్చేసరికి దున్ని పెట్టేయ మన్నాను గదా! నాలుగు దినాలుగా ఏం చేసినావు? కాదంటే ఒకటి సగంగా చెరుకు తుండ్లు కాలిపించినావు. పట్టుదల లేనోడు బొంబాయి ఎయిర్ పోర్టుకు కూడా పోలేడు తెలుసునా? ఏజెంటుకాడికి ఎన్ని దినాలు తిరగాల? ఈ పొద్దూ, రేపూ అని వాడు అరి చేతిలో స్వర్గం చూపించి నూర్లు నూర్లుగా దుడ్డు మాయం చేసేస్తాడు. ఇదొకటీ, అదొకటీ అని పోయినప్పు డంతా కాగితాల మీద చెవ్రాలు చేయించుకోని ఫీజు దుడ్డు వసూలు చేస్తానే ఉంటాడు. ఎందుకిదీ అని అడిగినా వంటే నీ పని ఇంకయినట్టే! నీ అట్లాంటోడు ఏజెంటు చెయ్యి తడిపే దానికే పాలుమాలి ఇక్కడ్నే కాళ్లు జాపేస్తాడు!" సాలెపురుగు కదులుతున్నట్టుగా చేతులు తిప్పి హావభావాలు ప్రకటిస్తూ రాజగోపాల్ వాదించసాగాడు.

"నీకు బాగా తెలిసిన ఏజెం టుండా డని అంటివి గదన్నా!" షుకూర్ కళ్లు పెద్దవి చేసుకుని అడిగాడు.

"ఎంత తెలిసినోడైతే మాత్రం ఊరికే పని చేస్తే వాని కడుపాత్ర మెట్ల తీరితింది? తొలీ తడవ బొంబాయికి పోయినప్పుడు వాళ్ల లాడ్జింగులో నెల దినాలకు పైగా ఉండాల్సొచ్చింది. అసలు వీసా వస్తిందో, రాదో తెలియని పరిస్థితి. అప్పటికే అయిదు వేలు సెలవయి పోయింది. టికెట్లకని ఎత్తుకోనిపోయిన ముప్పయి వేలల్లో రెండు వేలు లాడ్జికే ఖర్చుపోయింది. ఏజెం టొక సారి వారాలు వారాలుగా కంటికి కనబడకుండా పోయినాడు. ఇంక నవకం భుజా నేసుకుని ఇంటికి పోవాల్సిందేనని అనేసినారు కొందురు. అయినా పట్టిన పట్టొదిలినానా చెప్పు? చస్తే ఇక్కడ్నే చావనైనా చస్తాను గానీ ఎనక్కు పొయ్యేది లే దనేసినాను. నీ మాదిరి రెండు గంటలు వాళ్లింటి కాడ కాపేసి ట్రాక్టరోణ్ని తొడుక్కోని రాలేనో న్నయితే కువాయిట్‌కు పోయుందునా అని? నిన్ను నమ్ముకోని ట్రాక్ట రొస్తింది గదా అని తెల్లారు జామున్నే లేచి ఈడి కొచ్చి కాపెట్టుకోని కూర్చున్నాను. నిన్నని ఏం లాభం? తప్పు నాది!" మాట్లాడుతూనే పైకి లేచి పాంటు జేబులోకి చేయి పెట్టి పాన్ పరాగ్ పాకెట్టు పైకి తీసుకున్నాడు.

తనను పట్టించు కోకుండా వాళ్లిద్దరూ మాటల్లో పడిపోవడంతో స్వామి ప్రేక్షకమాత్రు డైపోయాడు. అర మోడ్పు కన్నులు పెట్టి పెదవులు కదిలిస్తూ జపం చేసుకుంటున్నట్టుగా ముఖం పెట్టుకుని వాళ్ల మాటలు వినసాగాడు.

షుకూర్ మామిడిచెట్టు కొమ్మ పైకెక్కి కూచుంటూ "ఆ సుబ్బరామ చౌదరి కెమెరా కొంటా నంటా ఉండాడు. రేటెంతో తెలుసుకోమన్నా డన్నా!" అన్నాడు.

చిటికెడు పాన్ పరాగ్ నోట్లో వేసుకుని నములుతూ, "ఎవురూ? దిగీథి పెద్దింటోళ్ల చిన్నబ్బోడేనా?" అని అడిగాడు రాజగోపాల్.

షుకూర్ తల ఊపాడు.

"వాడి ముఖం, వాడు కొనేదీ లేదు పాడూ లేదు!" ఎర్రటి ద్రవాన్ని దూరంగా ఉమ్ముతూ అన్నాడు రాజగోపాల్ - "వచ్చినప్పు డంతా టేపు తీసకరా, వీసీఆర్ తే అంటాడు గానీ వాడు కొనిం దెప్పుడూ లేదు. భలే బేరం పట్టుకొచ్చినావులే!" అంటూ నోరు చప్పరించేశాడు.

"అట్ల మాట్లాడితే నే నొప్పుకోను. నాలుగు నూర్లు జేసే ట్రాన్సిస్టర్ని ఆరు నూర్లకు సెటిల్ చేసింది నేనే గదా! రే బోన్ కంటద్దాల్ని వెయిన్నీ మున్నూరుకు బేరం కుదిరించిం దెవురు? ఈ మధ్యలో వానలు సరిగ్గా పడక, ఈ ఫలితం సరిగ్గా రాక అందురూ గుడ్లు తేలేసుకో నుండారు. లేక పోయుంటే ఈ పాటికి నువ్వు తెచ్చుండే సరు కంతా అమ్మించి పారేసుందును. నా అంత సరిగ్గా చింత గింజల యాపారం చేసే నోడు ఈ ఊర్లోనే లేడని ఎవు ర్నడిగినా చెప్తారు. అడుగు పెట్టే ముందు ఎనకా ముందు చూసుకోని దిగాల! దిగినామో ఇంక అప్పీ లుండగూడదు. అదీ నా లెక్క!" షుకూర్ నూనూగు మీసాల పైన చేయి వేసి కళ్లు గుండ్రంగా తిప్పసాగాడు.

'నీ మాదిరి పెద్ద పులావరని పోజులు పెట్టి నోళ్లని ఇంత మందిని చూసినాను!' చేత్తో గుప్పెడు జుట్టు పట్టి చూపుతూ అన్నాడు రాజగోపాల్. "కువాయిట్‌లో పనికి తట్టుకోలేక రెండో దిన్నానే చేతు లెత్తేసినోళ్లు ఎందురో తెలుసునా? అక్క డెవురూ నీకు డన్‌లప్ బెడ్డులేసి సదుపాయాలు చెయ్యరు. ఉండే దాని కో చిన్న షెడ్డు. దాంట్లో నీతోబాటూ నీ మాదిరోళ్లే కొందురు. నీ వంట నువ్వే వండుకోవాల. నీ గుడ్డలు నువ్వే ఉతుక్కోవాల. పని టయానికి హాజ రైపోవాల. లేటయితే జీతం కట్! పనంటే పనే! ఊపిరి తిప్పుకునే తీరికుండదు. డ్రయివిం గంటే ఇక్కడ మాదిరి గాదు. అదయి పోతూనే మిగిలిన పనులు కూడా చెయ్యాలి. కిలాడీ పనులు చేసినా వంటే జైల్లోకి తోసేస్తారు. నమ్మకంగా ఒళ్లు దగ్గిర పెట్టుకోని పని చెయ్యాల. దుడ్డు ఎంత అవసరమో అంతే ఖర్చు పెట్టుకోవాల. అప్పుడే ఇంటికేమైనా పంపచ్చు. లేకపోతే ఏమీ మిగలదు. వచ్చినప్పు డంతా ట్రాన్సిస్టర్లూ, టేపులూ తెస్తా ఉండానని వొద్దంటే దుడ్డొస్తా ఉందని అనుకుంటా ఉండావేమో! ఎంత కష్టపడతావో, అంతే సంపాదన. ముందే తెలుసుకో! మల్లంక చెప్ప లేదంటే ఒప్పుకునేది లేదు!"

"నా సంగతి నీకు తెలియదన్నా! నన్ను తొడుక్కోనిపోయి పనిలో చేర్పించిన పెద్దమనిషికి నా గురించి ఒక్క మాటొస్తే నే నొప్పుకోను!" అన్నాడు షుకూర్.

రాజగోపాల్ స్వామి వైపు చూశాడు. ఆ క్షణం కోసమే ఎదురు చూస్తున్నట్టుగా అతను కళ్లు పూర్తిగా తెరిచి చిరునవ్వు నవ్వాడు.

"నిన్న కత్తి తెచ్చినప్పుడు ఈ సపారులోనే పెట్టినావు గదా! ఆ మణేగారి తోట్లోకి పోయి, నా పేరు చెప్పి రెండు ఎర్ర నీళ్ల టెంకాయలు తోసకరా! సామికి టెంకాయ నీళ్లయినా ఇద్దాం!" మంచం కోడు పైకి వాలి పడుకున్నట్టుగా సోలిపోతూ హుకుం జారీ చేశాడు రాజగోపాల్.

షుకూర్ అయిదు నిముషాల సేపు అటూ ఇటూ పచార్లు చేసి, సపారులోకి దూరి, కత్తి చేత బట్టుకుని బయటి కొచ్చి, మట్టి బాట వైపు నడవసాగాడు.

## జోక్

### మతిమరుపు

"నాకు మతిమరుపు ఉన్న సంగతి డాక్టరుతో చెప్పాను."

"ఆయన ఏమన్నాడు మరి?"

'ముందు ఫీజు చెల్లిస్తే కాని వైద్యం చేయనన్నాడు.'

"ఈ పిలగాణ్ణి గూడా నీతోబాటూ ఆ దేశానికి తొడుక్కోని పోతా ఉన్నావా, నాయనా!" తన పొలకువ తెలపడం కోసం స్వామి పలకరించాడు.

"వచ్చినప్పటి నుంచీ ఎట్లయినా గల్ఫుకు తొడుక్కోని పొమ్మని ప్రాణాలు తీస్తా ఉండాడు!' ' అతడి వైపు తిగరకుండానే చెప్పసాగాడు రాజగోపాల్ - "కోరికల కేమీ తక్కువ లేదు గానీ ప్రయోజకత్వ కొంచె మయినా లేదు. నేను ఎందురి కాళ్లు పట్టుకోని, ఎంత దుడ్డు ఖర్చు పెట్టితే కువాయిట్‌కు పొయినానో వీనికేం తెలిస్తింది? మంచి మంచోళ్లకే అక్కడ చెలామణీ లేదు. వీడొచ్చి తవ్వి తలకెత్తే దేముంది? నే నీసారి కువాయిట్‌కు పోవటం లేదు; షార్జాకు ట్రయి చేస్తా ఉండాను అంటే గూడా వదలటంలేదు. అక్కడికైనా పర్వాలేదు, వచ్చేస్తా నని తగులుకో నుండాడు!"

కాస్సేపు ఆలోచించి "కువాయిట్ కంటే షార్జాలో ఆదాయం ఎక్కువా నాయనా?" అని అడిగాడు స్వామి.


"ఒకటో రెండో అటూ ఇటూగా అంతా ఒకటే! లేదంటే కువాయిట్‌కూ, నాకూ ఋణం తీరిపోయింది. నిజానికి నా పెండ్లాం చేసుకున్న పుణ్యం బాగునింది. లేక పొయ్యుంటే ఈ పాటికి కువాయిట్ జైల్లో కమ్ములు లెక్కబెట్టుకుంటా కూచోనుందును!" రెండు నిముషాలు కాలయాపన చేసిన తరువాత మళ్లీ రాజగోపాలే కొనసాగించాడు - "మా మేనేజరును ఫాక్టరీ కాడికి తీసుకోని పొయ్యేటప్పుడు ఆక్సిడెం టయింది. నేను రైట్ సైడే పోయినాను. లారీ వాడు రాంగ్‌లో వచ్చి గుద్దేసినాడు. రియర్ మిర్రర్‌లోంచి చూసుకోలేదని ఉద్యోగ మియ్య ననేసినారు. ఆస్పత్రిలో రెండు దినాలు పెట్టుకోని, పోలీస్టేషనుకు పిలిపించి, ఇన్నూరు దీనార్లు ఫైన్ వసూలు చేసుకున్నారు. దక్కినమ్మకు బొక్కింది చాలనుకోని గుడ్డా గుసురూ సర్దుకోని ఫ్లైటెక్కేసినాను."

మట్టి బాటపైన కందెన మరచిన ఎద్దు బండి చక్రం శబ్దం చేసుకుంటూ వెళ్తోంది. ఎక్కడి నుంచో బోరింగు యంత్రం సవ్వడి స్పష్టంగా వినవస్తోంది. సూర్యుడు కిరణాల్ని కొండల పైన పదును పెట్టుకుంటున్నాడు.

పెద్దగా నిట్టూర్చి, "ఒకర్నని లాభం లేదు. నా జాతకం బాగలేదు!" అన్నాడు రాజగోపాల్. "సరిగ్గా వాడు ఆస్పత్రిలో చేరే సమయంలో రావాలని రాసి పెట్టుంటే తప్పించుకునే దాని కవుతుందా? ఇప్పటికే రెండు వేలు చిలుం వదిలి పోయింది. చాలని దానికి ఈ మడి దున్నకం పనీ, నారు నాటించే పనీ నా పైన్నే పడింది. సొంతంగా నా దగ్గరైతే వసూలు చేస్తా ఉండారు గానీ, వీళ్ల నాకు అవస రమైనప్పుడు పైసా ఇచ్చుండారా? ఎమ్మే అయినాక ఇంట్లో ఖాళీగా నాలు గేళ్లుంటే నరకమే చూపించినారు గదా! నా కంటే ముందుగా ఉద్యోగ మొచ్చినప్పుడు మా తమ్ముడెంత నీలిగినాడు? వాణ్ణి చూసిన కంటితో తల్లీ దండ్రీ అయినా నన్ను చూసినారా? ఏందో రెండు దమ్మిడీల సంపాయిస్తా ఉండాను గాబట్టి ఇప్పు డందురూ అయినోళ్లయిపోయినారు!' '

అతడి ధోరణి మార్చడం కోసం 'మీ నాయ నింకా హాస్పట నుంచి రాలేదా?' అని ప్రశ్నించాడు.

"రాలేదు. ఆయన కక్కడ కొల్లబోతా ఉందంట! ఇక్కడ నే నుండాను కాబట్టి దిగు ల్లేకుండా ఉందంట! ఇప్పు డిప్పుడే రాడంట. ముందు నుంచీ ఆయన దెప్పుడూ వలపక్షమే! ఉద్యోగాలు రాని చదువులోకి నన్ను తోసేసి, మా తమ్ముణ్ణి మాత్రం మంచి దాంట్లోకి చేర్పించినాడు. నాలు గైదేండ్లు వృథాగా పోయింది. మా బావ కాళ్ల పట్టుకోని డ్రైవింగు నేర్చుకోని, లైసెన్సు తెప్పించుకున్నాక ఈ బతుకు తెరువైనా దొరికింది. 'పెద్దగా చదువుకున్న డ్రైవ రయితే కువాయిట్ మత్తేబులు తటపటాయిస్తారు. ఎమ్మే చదివినట్టు ఎవురితోనూ అనద్దు' అని ఆ ఏజెంటు లక్ష సార్లు చెప్పినాడు.




రెండు కొబ్బరి కాయల్ని తొడిమల్తో బాటూ పట్టుకుని మోసుకొచ్చాడు షుకూర్.

"ఇం కొంచెం పెద్ద కాయల్ని తెచ్చుంటే నీ సొత్తేం పోతింది?" రుసరుసలాడాడు రాజగోపాల్.

"ఇంత కంటే పెద్ద టెంకాయలు ఈ పక్క తోటలో ఏడైనా చూపిస్తే నూర్రూపాయలు ఊరికేనే ఇచ్చేస్తాను!" షుకూర్ కత్తితో కొబ్బరి కాయని కొట్టి రంధ్రం చేస్తూ చెప్పసాగాడు - "ఆ మణేగారు వాళ్ల బాయి కాడనే ఉండాడు. ను వ్వొకసారి తోట కాడికి రమ్మన్నావని చెప్పినాను. వస్తా నన్నాడు."

"వగలయినోడు ఆ మాటనడు. కూడా తొడుక్కోని వచ్చుంటాడు!" కొబ్బరి కాయను తీసి స్వామి కందిస్తూ కసురుకున్నాడు రాజగోపాల్.

"మణే గారంటే మనింట్లో సేద్యగాడు కాదన్నా! రమ్మంటే కూలిమనిషి మాదిరిగా చక్కా వచ్చేస్తాడా? ఆ కాడికీ గల్ఫ్ సిగరెట్టు పెట్టలు నీ కోసరమే తెచ్చి నాడని ఆశ పెట్టినాను. నీ ఎనకనే వస్తాను పద మన్నాడు!" రెండో కొబ్బరి కాయని రాజగోపాల్ కందిస్తూ షుకూర్ సమాధానం చెప్పాడు.

"ఈ పను లంతా పేరబెట్టుకుంటే నీకే నష్టం!' ' కొబ్బరి నీళ్లు తాగుతూ చెప్పసాగాడు రాజగోపాల్ - "ఆ ఏజెంటు పోయిన సోమవారమే రమ్మన్నాడు. నే నీ ఊళ్లో ఈ పనులన్నీ చక్కబెట్టినాక గానీ కదల్లేదు. ఆ పైన నీ ఇష్టం!"

"చూస్తా ఉండన్నా! టాక్టరు వచ్చిందంటే రెం డెకరాల భూమి దున్నే దెంతసేపు? సుబ్బరామ చౌదరికి కెమెరా, పత్తార్ సాబుకు టేపూ, కృష్ణారెడ్డికి ట్రాన్సిస్టరూ బేరం చెప్పేసినాను. ఇం కీ మణేగారి ప నొకటి మిగిలుండాది. ఈ పొద్దో, రేపో అదీ అయిపోతుంది!" నీళ్లు తాగగా మిగిలిన కాయల్ని రెండుగా చీల్చి కొబ్బరి తీస్తూ అన్నాడు షుకూర్.

"ముందు మణేగారి దగ్గిరికి పో! సిగరెట్టు పెట్టె నా జేబులోనే ఉందని చెప్పి ఇక్కడికి పంపించు! కృష్ణారెడ్డిని ఎతికి పట్టుకోని మడి దున్నించు. సాయంత్రం కెమెరా, టేపూ బేరాలు చూద్దాం!" రాజగోపాల్ వరసగా పనులు పురమాయించాడు.

కత్తిని సపారులో చెక్కిన తర్వాత షుకూర్ కా ళ్లీడ్చుకుంటూ తోట బయటికి నడిచాడు.

Ⓟ ముగింపు పైవారం

(కిందటి సంచిక తరువాయి)

తేత కొబ్బరి నములుతూ, "అయితే మళ్లా దేశం వదిలిపెడతా ఉండావా నాయనా!" అని అడిగాడు స్వామి.

"అవును, సామీ! ఈ దేశం మనకు లాయికీ గాదు. పనితనమూ, ఎక్స్‌పీరియన్సూ ఇక్కడ పనికి రావు. చేసే పనికీ, వచ్చే ఆదాయానికీ సంబంధం ఉండ దిక్కడ. అక్కడైతే చేసినంత పనీ, సంపాదించినంత జీతమూ ... ఫాల్టు నాది గాదని ఎంత చెప్పినా వాళ్లు విన్లేదు. ఇంక కువాయిట్‌కు పొయ్యే దోవ లేదు. ఆ ఏజెంటు షార్జాకు పింపిస్తా నన్నాడు. ఇక్కడ దుడ్డు లేనోడు పూచిక పుల్లకు పనికి రాడు. పోయిన సమత్సరమే పాకాలలో మిద్దె గట్టించినాను. రెండేండ్లకు ముందు కొత్త కోట కాడ రెం డెకరాల మామిడి తోట కొనిపెట్టినాను. వొయి సుండేటప్పుడే పది పన్నెండేండ్లు సంపాయించుకోని వచ్చేయాల. ఉండేది ఉప్పు రాళ్ల మాదిరి ఇద్దరు కొడుకులు. తలా ఒకిల్లు, తలా ప దెకరాల మామిడి తోట ... కాలు మీద కాలేసుకోని కూర్చున్నా జరిగి పోవాల.

# మధురాంతకం నరేంద్ర గమ్యం

నా మాదిరిగా దేశం గాని దేశానికి పోయి సంపాయించుకోని రావాల్సిన గతి వాళ్లకు పట్ట గూడదు. పెండ్లాం, బిడ్డలను ఒదులుకోని ఒంటిబిత్తిరి బతుకు వాళ్లు బతకగూడదు!" సూటిగా తూర్పు కొండల కేసి చూస్తున్న రాజగోపాల్ కళ్ల ల్లోంచి సూర్యకిరణాలు చుక్కల్లా మెరుస్తూ పరావర్తనం చెందుతున్నాయి. అంత వరకూ చిడిముడిపాట్లు పడుతున్న అతడి ముఖంలో మొదటి సారిగా చిరునవ్వు తొంగి చూస్తోంది. చేతి కొంక కట్టుందన్న విషయాన్ని సైతం మరచిపోయి కుడి చేతితోనే కొత్త పాన్ పరాగ్ పాకెట్టు చింపుతున్నా డతను.

"మా తమ్ముడికి ఈ చేసు మిందా, తోపు మిందా మన సిరిగిపోయింది." మళ్లీ నింపాదిగా మొదలెట్టాడు రాజగోపాల్ - "వాళ్లత్త గారి ఊరు మింద మనసు మళ్లింది. 'అవేమ్మేయాలని పట్టుబట్టుకో నుండాడు. మా రామచంద్రుడికి భూమీ బుట్రా ఇష్టం లేదు. ఎవురికో ఎందుకు అమ్మాల? మతింపేసి మనమే కొంటే పోయిందని అనుకుంటా ఉండాను. మనలో మన కయితే స్టాంపు డ్యూటీ కూడా తగ్గితింది. అయినా ఈ ఊర్లో ఇప్పుడు బేరానికి దిగే దానికి రూక లెవురి కుండాయి? మణే గార్ని మతింపు చెప్పే దానికి రమ్మన్నాను."

"ఎండెక్కి పోతా ఉంది. బయల్దేరతాను, నాయనా!" పైకి లేచి నిల్చుంటూ అన్నాడు స్వామి.

"పదైదు దినాలకు ముందు నే నొక సారి ఆశ్రమం దగ్గిరి కొచ్చినాను, సామీ! మీరు లేరని చెప్పినారు" మర్యాదకోసం తానూ కొంత దూరం నడుస్తూ చెప్పాడు రాజగోపాల్.

"పద్దెనిమిది దినాలుగా ఎర్రేవల్లి శుకబ్రహ్మాశ్రమంలో గీతోపన్యాసాలు. ఇక్కడి కొచ్చింది నిన్ననే!" అన్నాడు స్వామి.

"మీ రొచ్చినట్టు మా నాయనకు కూడా జాబు రాసినాను. అక్కడ పనెక్కువగా ఉండేటట్టుంది. సీజ నయిపోతానే వచ్చేస్తాడు!" కంచె దగ్గర ఆగిపోతూ వర్తమానాన్ని వెల్లడించాడు రాజగోపాల్.

తల ఊపుతూ నడవసాగాడు స్వామి.

మట్టి బాటపైన కాస్సేపు నడచిన తర్వాత వెనుదిరిగి చూశాడు.


రాజగోపాల్ ఇంకా అక్కడే నిల్చుని తనకేసే చూస్తున్నాడు.

నీళ్లలో వల వేసి కాచుక్కూచున్న ఆటవికుల్లా మట్టి గుట్టలూ, వలల్లా మామిడి తోటా, మడీ, వలలో చిక్కిన కొరమీనులా రాజగోపాల్ కనిపిస్తున్నారు.

- 3 -

ఎండ నంతటినీ భూగోళంపైకి కేంద్రీకరించడం కోసం ఆకాశంలో నిలబెట్టిన కుంభాకార కటకంలా సూర్యుడు మెరుస్తున్నాడు.

అద్దాలు కుట్టిన ఆకు పచ్చని చీర చుట్టుకున్న





నుగాలీ పాపాయి లిద్దరు కౌగిలించుకుని కూర్చున్నట్టుగా ఎండను పరావర్తనం చేస్తున్న బండ రాళ్ల గుట్టా, దాని చుట్టూ మామిడి తోటా కనిపిస్తున్నాయి.

అటూ ఇటూ కలయజూస్తూ తోటలోకి అడుగుపెట్టాడు స్వామి.

గాలి వీచకపోవడంతో ఆ కల్లాడని మామిడి చెట్లు బొమ్మల్లా నిల్చున్నాయి.

తోటలోకి నాలు గడుగులు సారించగానే రెండు పెద్ద మామిడి చెట్ల నీడలో ఎర్రటి లారీ ఒకటి కనిపించింది. దాని పైన బిగించిన టార్పాలిన్ పట్టా లోంచి మామిడి కాయలు కొన్ని తొంగి చూస్తున్నాయి.

సపారు కవతల మామిడి చెట్టు మొదలు దగ్గర ఏడెనిమి దేళ్ల వయస్సున్న అబ్బా యొకడూ, నాలుగై దేళ్ల వయస్సున్న అబ్బా యొకడూ రెండు కుక్క పిల్లలతో ఆడుకుంటున్నారు. తోటంతా ప్రతిధ్వనిస్తుండగా కుక్కపిల్లలు రెండూ ప్రాణభయంతో గగ్గోలు పెడుతున్నాయి. పిల్లల కేరింతలూ, కుక్కపిల్ల అరుపులూ జోల పాట లేమో నన్నంత హాయిగా సపారు ముందు కుక్కి మంచంపైన కూర్చునే నిద్రలో జోగుతున్నా డో వ్యక్తి. చేతులు మొలిచిన గుర్రానికి షర్టూ, పాంటూ తొడిగినట్టున్న ఆకారం అతడిది. పలచబారుతున్న వెంట్రుకల్లో అక్క డక్కడా తెల్ల వెంట్రుకలు కనిపిస్తున్నాయి.

స్వామి మంచం దగ్గరికొచ్చి నిల్చున్నాడు.

కొత్త వ్యక్తి పొలకువను గమనించినట్టుగా పిల్ల లిద్దురూ కుక్క పిల్లల తోకలు పట్టి ఆడిస్తున్నారు.

కాషాయవస్త్రంతో చెమట తుడుచుకుంటూ మంచాని కో చివర్లో కూర్చున్నాడు స్వామి. మంచం కూసాలు కిర్రుకిర్రు మన్నాయి. తూగుతున్న వ్యక్తి ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు. కలో, నిజమో తేల్చుకోలేకపోతున్నట్టుగా కాషాయంబరధారిని చూసి తడబడిపోయాడు. గడ్డమూ, మీసమూ విడివడేలా ఓ చిరునవ్వు మధ్యలో పుట్టించి,

"రామచంద్రయ్యే గదా నువ్వు!"

అని పలకరించాడు.

అతను పైకి లేచి, రెండు చేతులూ జోడించి, "నమస్కారం ... నమస్తే ...! మీరు ... మీరే కదా!' ' అంటూ కూడీ కూడీ

చదువుతున్నట్టుగా పొడి పొడి అక్షరాల్ని ఉచ్చరించాడు.

ప్రశ్న అర్థమైనట్టుగా తల ఊపుతూ, "కూచో, నాయనా!" అని మంచం చూపెట్టాడు స్వామి. అతను కూర్చున్న తర్వాత, "ఈ దినం మణే గారి ఇంట్లో భిక్ష" అని బొజ్జ తడుముకుని, "సాయంత్రం ఆశ్రమంలో గీతాప్రవచన ముంది. అందుకని వెంటనే బయల్దేరేసినాను. ఎండ జాస్తీగా ఉంది కదా! కొంచేపు తోటలో విశ్రాంతి తీసుకుందామని ఇట్లొచ్చినాను. పిలకాయ లిద్దరూ ఆడుకుంటా కనిపించినారు" అంటూ ముక్తాయించాడు.

రామచంద్రయ్య పిల్లలిద్దర్నీ, "టింకూ! సోనీ!' ' అని పిలిచి "స్వామికి విష్‌చేయండి!" అన్నాడు.

గోల పెడుతున్న కుక్క పిల్లలున్న చేతులతోనే వా ళ్లో సారి "గుడ్ ఆఫ్టర్ నూన్!" అంటూ సాగదీసి, అంతటితో తమ పనయి పోయినట్టుగా లారీ దగ్గరికి పరుగెత్తారు.

"ఇంట్లో ఎవురైనా ఉండారేమో చూసి రమ్మని తోటోడ్ని పంపిస్తిని. వాడే చెప్పినాడు నువ్వొచ్చి రెండు దినా లయిందనీ, ఇప్పుడు తోట కాడ ఉండావనీ! మీ అన్న లిద్దర్నీ చూసినాను. ఇప్పుడు నిన్నూ చూసేసినాను. సంతృప్తిగా ఉంది. నీ భార్యను కూడా తోడ్కొని రాగూడదా నాయనా?" ఎండకు తాళలేక ఆపసోపాలు పడుతూ ప్రశ్నించాడు స్వామి.

"లేదండీ!" పెద్దగా శబ్దం వచ్చేలా ఆవులించా డతను. "ఆమెకి స్కూలుంది. ప్రయివేటు స్కూల్లో టీచరుగా పని చేస్తా ఉందిలెండి! ఎస్టాబ్లిష్‌డ్ స్కూలే! కంపారిటివ్‌గా ఒక మాదిరిగా పే చేస్తారు. ఈ సమ్మర్ హాలిడేస్‌లో కూడా వాళ్లు ఫౌండేషన్ కోర్సులు జరపతా ఉన్నారు. ఇప్పు డొచ్చే ఫీజుల్లో సగం టీచర్లకే ఇస్తారు. అందుకని ఆమె అక్కడే ఉండి పోయింది."

పిల్లల చేతు ల్లోంచి ఎగిరి గంతేసి కుక్క పిల్ల గొంతు చించుకుంటూ పరుగెత్తసాగింది. వాళ్లిద్దరూ దాని వెంటపడ్డారు.

"పిలకాయలు వాళ్లమ్మని కలవరించరా?" అని అడిగాడు స్వామి.

"కలవరించినా దగ్గరుండే సమయం వాళ్లమ్మ కుంటే గదండీ!" మరో సారి ఆవులిస్తూ చెప్పాడు రామచంద్రయ్య - "తెల్లారి ఆరు నుంచీ తొమ్మిది దాకా స్పెషల్ క్లాసులు. తొమ్మిది నుంచీ అయిదు దాకా స్కూలు. అయిదు నుంచీ ఎనిమిది దాకా స్పెషల్ క్లాసులు. స్పెషల్ క్లాసుల ఫీజు టీచర్లకే ఇస్తారు. అందుకని పని తప్పదు. ఆమె ఇంటి కొచ్చే సరికి పిల్లలు తూగుతూ ఉంటారు. పిల్లల చార్జీ నా పైన పడి చానా ఏండ్లయి పోయింది. అందుకే నాతో బాటూ తొడుక్కొచ్చాను. ఊరి నిండా బంధువులనే పేరే గానీ పిలకాయల్ని చేరదీసేవా ళ్లెవురూ లేనే లేరు. పనోళ్లు చేసిన సంగటే వాళ్లూ తిన్నారు. ఇంట్లో వాళ్లందురూ హాస్పిటల్ దగ్గిరే ఉన్నారు. ఈ ఊరి కొచ్చినప్పటి నుంచీ ప్రేమగా పలకరించే వాళ్లే కనబడలేదు. మిమ్మల్ని చూస్తే ప్రాణం లేచొచ్చింది!"

కుక్క పిల్ల లారీ కింది కెళ్లిపోయింది. పిల్ల లిద్దరూ లారీ కింద పాకసాగారు.

"పిల్లలు దెబ్బలు తగిలించుకుంటారేమో, చూడు నాయనా!" స్వామి హెచ్చరించాడు.

"ఆ భయం లేదులెండి! అవసరమైతే లారీ బోల్టులు లాగిపారేస్తారేమో గానీ, వాళ్లు దెబ్బలు తగిలించుకోరు. ఆ మాదిరిగా తయారుచేసినాను వాళ్లను." జేబులో చేయి పెట్టి సిగరెట్టు పెట్టె వెలుపలికి తీయబోయి అంతలోనే ఆ ప్రయత్నాన్ని అతికష్టంపైన విరమించుకుని, శరీర మంతా కదిలిపోయేలా ఒళ్లు విరుచు కున్నాడు రామచంద్రయ్య.

"బుద్ధి కొద్దీ జీవన మంటాది శాస్త్రం. మీ ముగ్గురిలోనూ నిన్ను చూస్తే కడుపు నిడతా ఉంది, నాయనా! చదువుకునిం దానికి ఉద్యోగం చేసుకుంటా ఉండావు. టౌన్లో సంసారం చేసుకుంటా ఉండావు ..." స్వామి భుక్తాయాసంతో రొప్పుతూనే ఉన్నాడు.

"టౌన్లో బతికే దంటే సులభమైన పని గాదు, స్వామీ! ఖర్చెక్కువ. ఫైనాన్సు కార్పొరేష నొకటి మొదులుపెట్టి రెండే ళ్లవతా ఉంది. రోజా తెల్లా రొక గంట, సాయంత్ర మొక గంట ఆ పని. రియల్ ఎస్టేట్ బిజినెస్ మొదులుపెట్టినాం ఈ సంవత్సరమే! అయిదు మంది పార్టనర్లు. కొంచెం ఏమారితే మునిగి పోతాం. అక్క డొక రెండు మూడు గంటల పని. ఈ పనులతోనే సతమత మౌతా ఉంటే ఇక్క డొక రెండు మూడు రోజు లుండి తోట కోత పని చూడమని బళ్లారి నుంచి టెలిగ్రా మిచ్చినాడు మా నాయన. మా రెడ్డప్పన్నకు భలే ఆత్రం. ఉండే దాంతో తృప్తిపడాల గానీ, లేని దాని కోసరం వెంపర్లాడితే ఏం లాభం? వొళ్లెరగకుండా పరిగెత్తితే ఏమయితింది? ఒళ్లు వశం తప్పితింది. రెండేళ్లకు ముం దొక సారి ఆలోచన చేసీ చేసీ నరాలు దెబ్బ తిని బెంగుళూరు నిమ్‌హాన్సులో అడ్మి టయినాడు. అయినా తప్పు తెలిసి రాలేదు. చెరుకు తోటలో నష్టమొచ్చినప్పుడు గుబులు పెట్టుకోని రోగాన్ని తిరగబెట్టుకున్నాడు. తిరపతి రూయా ఆస్పత్రిలో నెల దినాలున్నాడు. డిశ్చార్జీ అయి వచ్చీ రాంగానే తోటలో కొచ్చి కావిలి పని మొదులుపెట్టినాడు. మొన్న గంగ జాతరప్పుడు పెద్ద గాలీ వానా వచ్చింది. వడగండ్లు పడి సగం కాయలు పనికి రాకుండా పోయినాయి. ఒద్దని చెప్పినా వినకుండా తోటలోనే పిచ్చోడి మాదిరిగా వెంపర్లాడి ఉపద్రం కొని తెచ్చుకున్నాడు. ఆస్పత్రి నుంచీ వచ్చి రెండు వారా లయినా కాక ముందే మళ్లా తిరపతి సిమ్స్‌లో జాయినైనాడు. అదేదో నరాల రోగమని డాక్టర్లు తేల్చి చెప్పి వార మయింది. మా పెద్దన్న కువాయిట్ నుంచీ వచ్చినాడు గదా! ఒక నాలుగైదు నెలలైనా పెండ్లాం, బిడ్డలతో కాలం గడుపుకుంటే ఏమి చెప్పండి? దుడ్డేమయినా తింటామా! సంపాయించి సంపాయించీ నెత్తినేసుకోని పోబోతామా! షార్జాకు వీసా సంపాయించుకునే దానికి బొంబాయికి పోయినోడు పోయినట్టుగానే ఉంది. నెలై పోయింది. పాకాలకు మా వదినకైనా జాబు రాయలేదని ఆమె దిగులు



# వారం వారం అవధానం - 16

**వచ్చిన పూరణలలో అత్యుత్తమంగా ఎంపికైన పూరణలు పంపినవారు:**

**1. కె.కె. ఆచార్యులు (వీరవరం) 2. కె. శ్రీనివాసులు (కలగటూరు)**

**3. ఆచార్య శ్రీవత్స (ఉయ్యూరు).**

పెట్టుకునేసింది. నాకేమో పనులన్నీ ఒదిలిపెట్టుకోని ఈ ఊరికి రమ్మని ఆర్డరేసినారు."

పెద్ద కు క్కొకటి బిగ్గరగా మొరుగుతూ లారీ దగ్గరి కొచ్చింది. పిల్లల చేతుల్లో కాలు విరుచుకున్న కుక్క పిల్ల మరింత బిగ్గరగా అరుస్తూ తల్లి దగ్గరికి పరుగెత్తింది. పెద్ద కుక్క ఆకారాన్ని చూసి భయపడి వెనక్కు తగ్గిన పిల్ల లిద్దరూ మట్టి గడ్డల్ని తీసి వాటి పైన విసరసాగారు.

"ఈ ఊరి కొచ్చి మూడు దినా లయింది. మొన్నంతా కోత లోళ్లు దొరక్క పని గాలేదు. నిన్న మధ్యాహ్నం మొదులుపెట్టి ఈ పొద్దు పదకొండు గంటలకు కోత పని ముగించినారు. మామూలుగా ఇరవై టన్ను లయ్యేది. ఈ సారి అయిదు టన్నులకే బ్రహ్మాండ మైపోయింది. లారీ కెత్తించి టార్పాలిన్ కట్టినాక చూస్తే టైరు పంచరయింది. స్టెప్నీ గూడా తెచ్చుకోలే దా డ్రైవరు. క్లీనరు గూడా లేడు. న న్నిక్కడ లారీకి కాపలా బెట్టి స్టెప్నీ తెచ్చే దానికి పేటకు పొయినాడు డ్రైవరు."

గాలి తెరొకటి వేడి దుమ్మును రేపుకుంటూ తోట నంతా పరామర్శిస్తోంది. ఎండ దెబ్బకు చెట్లలో తలదాచుకున్న కాకుల గుంపొకటి కావు కావు మంటూ గాలిలో కెగిరింది. చినిగిపోయి పాత పీలికల్ని బయటపెడుతున్న దిండును జరిపి, మంచంపైన పడుకున్నాడు స్వామి. పిల్లలు మంచం చుట్టూ పరుగెడుతూ దాగుడుమూత లాడసాగారు. వాళ్లను పట్టించుకోనట్టుగా స్వామి కళ్లు మూసుకుని, "నీ మాదిరి తెలివయినోళ్లు తక్కువగా ఉంటారు. ఇంకా పైకి చదివి ఇంకా పెద్ద ఉద్యోగం సంపాదించుకో నుండగూడదా, నాయనా!" అని అడిగాడు.

"చదవాల్సిన చదువు నంతా చదివేసినాను. మైనస్ ఇరవై డిగ్రీల దగ్గర పదార్థాల స్వభావం. అదీ పీహెచ్డీలో నా టాపిక్. ఇప్పుడు చేస్తా ఉండే క్లర్కు ఉద్యోగానికి పదో తరగతి చదివి కూడికలు, తీసివేతలు తెలిసిన పిలకాయ చాలు. ఎవురో చెప్పిన సలహా విని అరకొర మనసుతో రాసిన గ్రూప్ త్రీలో సెల క్టయినాను. మా ఫ్రెండ్సు కొందురైతే బస్సు కండక్టర్లుగా గూడా ఉండారు. ఈ మధ్యనే మా ఆఫీసులో కొత్తగా ఒకామె ఉద్యోగంలో చేరింది. బియ్యే థర్డ్ క్లాసు. వాళ్లాయన పెద్ద ఇంజనీరు. రోజూ గవర్నమెంటు జీపులో వచ్చి పోతుంది. పని చెయ్యదు. మా ఇద్దరికీ జీతంలో పెద్ద తేడా లేదు. నా కింకా సెకండ్ హాండ్ స్కూటరే గతి. మా ఫ్రెం డొకడు వేరే ఆఫీసులో గుమాస్తా. పై ఆదాయం వద్దంటే వస్తుంది. పెద్ద పాలస్ మాదిరి ఇల్లు కట్టినాడు. నే నింకా అద్దె కొంపలో పడున్నాను. చదువుకూ, బతుక్కూ సంబంధం లేదండీ! మా ఆఫీసులో పని చేసినా, చెయ్యక పోయినా ఒకటే! బయటేదైనా వ్యాపారం మొదులుపెట్టితే గానీ పది మందిలో చెలాయించుకోని రాలేము. ప్రతి చిన్న పనికీ ఎవుడో ఒక చోటా లీడరు కాళ్లు పట్టుకోవాల. వాళ్లు చెయ్యి పెట్టని తావు లేదు. రూల్సు గీల్సూ దొంగ ల్దోలేసి చానా రోజు లైపోయింది. మూడేండ్ల కొక సారి ట్రాన్సఫర్లు, సర్వీసును బట్టి ప్రమోషన్లు, అంతెందుకు సంవత్సర మవతానే ఇంక్రిమెంట్లూ - ఇవంతా దుడ్డూ, పవరూ ఉండేవాళ్లకే! మిగిలినోళ్లంతా అఘోరించాల్సిందే!"

లారీ డ్రైవరు సీటు దగ్గర దొరికిన నీళ్లసీసాతో పిల్ల లిద్దరూ ఒళ్లు తడువు కుంటున్నారు. మాట్లాడుతూనే పిల్లల దగ్గరికి నడిచి బలవంతంగా సీసా లాక్కు:ని గుక్కెడు నీళ్లతో గొంతు తడుపుకున్నాడు రామచంద్రయ్య.

"నా నీళ్లన్నీ తాగేసినావు!" అంటూ చిన్న కుర్రాడు మట్టిలో పడి దొర్లసాగాడు. పెద్ద వాడు తండ్రి దగ్గర నుంచి సీసా లాక్కుని దూరంగా పరుగెత్తసాగాడు. చిన్న వాడు కూడా పైకి లేచి వాడి వెనకే దౌడు తీశాడు.

"మా సోనీ చానా క్లవర్!" కనురెప్ప లెగరేసి, నవ్వుతూ మంచం దగ్గరి కొచ్చాడు రామచంద్రయ్య. "ఈ కాలంలో పిలకాయలు మెత్తగా, నెమ్మదిగా ఉంటే లాభం లేదు. ఇప్పుడు ఎవుడి దగ్గర బల ముంటే వాడిదే రాజ్యం. చెయ్యీ నోరూ బలంగా ఉంటే చాలు. పిల్లలిద్దర్నీ కరాటేకి గూడా పంపిస్తా ఉండాను. ఇప్పుడే వాళ్ల క్లాసులో వీళ్లను చూస్తే అందరికీ హడల్! అసలు మా నాయిన పెంపకంలోనే తప్పుండా దండీ! ఆయనకు మొదటి నుంచీ నే నంటే అక్కర తక్కువ. చిన్నా చితకా ఉద్యోగాలకు మా పెద్దన్నను పంపించ నసేసినాడు. ఆయన కేమో దర్జాగా గల్ఫ్‌కు పొయ్యి చేతి నిండా సంపాయించుకుంటా ఉండాడు. పెద్ద చదువు చదివా నన్నైనా లేకుండా చిన్న ఉద్యోగానికే నన్ను పంపించేసినాడు. చిన్నన్నకు మొత్తం భూమి నంతా అప్పజెప్పేసినాడు. ఇదే నేను సేద్యంలోకి దిగుంటే ఈ పాటికి పెద్ద మిద్దె గట్టేసి ఉందును. ఈ పల్లెలో ఎవుడు పోటీ పడతాడు? ఎవుడికి వాడే రాజు గదా! అదే టవున్లో అయితే, ఎందురు పోటీ? వీధి వీధికీ ఎన్ని వ్యాపారాలు! ఎందురి కాళ్లు పట్టుకోవాల, ఎందురి చెయ్యి తడపాల? నువ్వూ, నీ ఉద్యోగమూ అని కాలక్షేపం చేస్తే పైసా మిగలపెడతామా? ఇప్పుడే ఇట్లుండాది, ఇంకో ఇరవై సంవత్సరా లయినాక, పెద్దవా ళ్లయినాక ఈ పిల్ల లెట్ల బతకతారు? ఉద్యోగా లొచ్చే ఆశ ఇప్పు డున్న వాళ్లకే లేదు. వీళ్ల కేది దోవ? అందుకే నా శక్తి అయినంత సంపాయించి పెట్టా లనుకుంటా ఉండాను."

నీళ్లయి పోయిన సీసాని లారీ బాడీ పైన పగలగొట్టి, గాజు పెంకుల్ని చేత బట్టుకుని ఒకరి నొకరు తరుముకుంటున్నారు పిల్ల లిద్దరూ. కాస్సేపు ఆలోచించి, తల ఊపుతూ, "వ్యాపారాల్లో సంపాదించినట్టుగా వ్యవసాయంలో గిట్టుబా టవదులే!" అన్నాడు స్వామి.

"వ్యాపారాల్లో కూడా లక్కుండా లండీ! ప దేండ్లకు ముందు బైలరు ముందు నిలబడి టీలు కలపతా ఉన్నాడు రామనాథ నాయుడు. ఇప్పుడు ఊళ్లో ఉండే పెద్ద లాడ్జీ ఓనరు. పద్దై దేండ్లకు ముందు బస్టాండు వెనక పక్క దొంగతనంగా సారా బుడ్లు అమ్మతా ఉన్నాడు రమాకాంత రెడ్డి. ఇప్పుడు పెద్ద హోల్ సేల్ మర్చంటు. కాలం కలిసొస్తే దుడ్డు తోసుకోని వస్తాది. గోల్ మాల్ చేసే తెలివీ, రిస్కు తీసుకునే తెంపరితనమూ ఉంటే చాలు. కొంచెం బ్యాకింగ్ ఉండాల. మన పేరు మీద పదెకరాల భూస్థితి ఉంటే ధైర్యంగా ఉంటింది. చూస్తా ఉండాను, ఎట్లయినా ఒక మామిడి తోట కొనిపెట్టుకోవా లనుకుంటా ఉండాను. ఎప్పుడైనా అర్జెంటుగా రొక్కం గావాలంటే తోటను అడమాణం పెట్టొచ్చు. అప్పిచ్చే వాళ్లు గూడా

భూస్వామికైతే సందేహించకుండా ఇస్తారు. అందుకే ఎంత వ్యాపారస్తుడికైనా కొంచెం భూముండాల!" చుట్టూ బొంగరంలా తల తిప్పి మామిడి తోటను కలయజూస్తున్నాడు రామచంద్రయ్య.

"బ్యాంకులో కావల్సినంత డిపాజిట్లూ, లక్షల పైన టర్నోవ రుండే బిజినెస్సూ, షేర్లూ, తిరగాలంటే కారూ..." రామచంద్రయ్య చూపులు పిల్లల శరీరాల మీదుగా పాకి మామిడి తోటను ప్రదక్షిణం చేసి, కణకణా మెరుస్తున్న ఎండ గుండా దూసుకుపోయి ఆకాశపు అంచు దాకా ప్రసరిస్తున్నాయి. పెదవులు తడుపుకుని, "ఆ మాత్రం లేకుండా టౌన్లలో బతుకు కష్టం! మనమూ మనుషులే అని అందురూ అనుకోవాలంటే ఆ మాత్రమైనా సంపాయించక తప్పదు" అన్నాడు.

పెద్ద పిల్లవాడు తండ్రి చెవి దగ్గర కొచ్చి ఏదో గొణుగుతున్నాడు. రామచంద్రయ్య మెల్లగా పైకి లేచి లారీ దగ్గరికి నడిచాడు. వెనక టైరు దగ్గరికి వెళ్లి చుట్టూ తిరిగి చూసి, "ఇదేనా?" అని ప్రశ్నించాడు. పిల్ల లిద్దరూ తల ఊపారు. రామచంద్రయ్య సపారు లోపల కాస్సేపు తచ్చాడి, కత్తి పట్టుకుని బయటికొచ్చాడు. "మా చిన్నోడు భలే ఇంటెలిజెంటు. మంచికి మంచీ, చెడ్డకు చెడ్డా! వా డేదైనా అనుకుంటే దానికి తిరుగు లేదు. ఆ లారీ డ్రైవరు వచ్చినప్పటి నుంచీ లా పాయింట్లు మాట్లాడతా ఉన్నాడు. కోత లోళ్లను చెందనియ్యా లేదు. వీ డెప్పుడో సందు చూసుకొని బాక్ టైర్లో చీల దించేసినాడు. వాడు రాక ముందే దాన్ని లాగిపారేస్తాను. చూసినాడంటే నోరు గొట్టుకుంటాడు!" పెద్దగా నవ్వుకుంటూ లారీ వైపు వెళ్లాడతను.

గబాలున పైకి లేవబోయాడు స్వామి. ఏదో అడ్డు తగలడంతో అలాగే వెనక్కు వాలిపోయాడు. ఆయన కాషాయంబరం మంచం కోడు దగ్గర ముడిపెట్టి ఉంది. పిల్లల వైపు చూశా డతను. వా ళ్లిద్దరూ రాళ్లు చేతి కెత్తుకుని లారీ చెక్కలపైన గీతలు గీస్తున్నారు.

వెళ్లొస్తా నని అయినా చెప్పకుండా స్వామి తోట లోంచి వెలుపలికి నడిచాడు.

పిల్ల లిద్దరూ అరుస్తూనే ఉన్నారు. అప్పు డప్పుడూ వాళ్ల నాన్న గొంతు కూడా వినిపిస్తోంది.

తోట పైకి మొహరించిన శత్రుసైన్యాల్లా సూర్యకిరణాలు భగభగలాడుతున్నాయి.

పెద్ద ఆకు పచ్చని పళ్లెంలా కనిపిస్తున్న మామిడి తోట అంచుల్లో రాళ్ల గుట్టలు రెండూ తలలు తెగి కిందపడ్డ జంతువుల్లా వికృతంగా కనిపిస్తున్నాయి.

**-4-**

సూర్యుడు ఆకాశపు పడమటి సగంలోకి ప్రవేశించి చాలా సే పయిపోయింది. కానీ ఎండ మాత్రం మట్టమధ్యాహ్నపు ఎండలా మండిపడుతూనే ఉంది.

మామిడి తోటను పరివేష్టించిన గుట్టలు రెండూ పచ్చని చేలపై వాలిన పావురాల్లా అమాయకంగా కనిపిస్తున్నాయి. సానువుల్దాకా వ్యాపించిన మామిడి తోట మట్టి గుట్టల రాక కోసం పరిచిన పచ్చ తివాచీలా కనిపిస్తోంది.

పరధ్యానంగా ముళ్ల కంచె దాటి, మామిడి చెట్ల నడుమ నుంచి మెల్లగా నడుచుకుంటూ తోటలో కొచ్చిన విమల ప్రకాశానందస్వామి ఉలిక్కిపడి అలాగే ఆగిపోయాడు.

విరిగిన మామిడి కొమ్మపై కూర్చుని సిగరెట్టు కాల్చుకుంటున్న వ్యక్తి కూడా పొగ వదిలిపెట్టడం సైతం మరచిపోయి స్థాణువులా ఉండి పోయాడు. సముద్రం ఒడ్డుకు కొట్టుకొచ్చిన తాటి దోనెలా నల్లగా నొక్కులు పడ్డ ఆకారం అతడిది. తలపై మిగిలిన కొద్ది పాటి తెల్ల జుట్టు చెమటతో తడిసి శరీరాని కంటుకుపోయి ఉంది. మాసి, గుండీ లూడిపోయిన చొక్కా తొడుక్కున్నాడు. కట్టుకున్న పాత నేత పంచె పైన గ్రీసు మరకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఘాటుగా సోకిన కిరసనాయిలు వాసనను వెంబడిస్తూ చూపులు సారించాడు స్వామి. పది బారల దూరంలో పెద్ద ఎనుబోతు లాంటి పాత జావా మోటరు బైకు కనిపించింది.

వెనక్కు తిరిగి వెళ్లిపోవాలో, లేక ముందుకు నడవాలో తోచక స్వామి కంగారు పడిపోసాగాడు.

వేళ్లు చురుక్కుమన్న తర్వాత సిగరెట్టు పీకను అవతలికి విసిరేసి, ఎవరు ముందు మాట్లాడుతారో నని పందెం వేసుకున్న వాడిలా అతను కూడా గ్రుక్కిళ్లు మింగసాగాడు.

తల అటూ ఇటూ తిప్పి చూసి, చుట్టుపక్క లెక్కడా మరో మనిషి పొలకువ లేదని తేల్చుకున్న తర్వాత తెచ్చిపెట్టుకున్న దగ్గొకటి దగ్గాడు స్వామి.


మరో సిగరెట్టు వెలిగించుకుంటూ, ఇక తప్ప దన్నట్టుగా "రా రా, చిన్నబ్బా!" అని పిలిచా డతను.

స్వామి అతడి కెదురుగా రచ్చలా అమర్చిన రాతి పలక పైన కూర్చున్నాడు. ఎంత వారిస్తున్నా ఆగకుండా చిరున వ్వొకటి అతడి పెదవు ల్లోంచి తొంగి చూసింది.


అతడి నవ్వుని చూడగానే ఎదుటి వ్యక్తి మరింతగా ముఖం చిట్లించుకుని, గొణుక్కుంటూ లెక్క వేసి "నలభై మూడేండ్లు ... నువ్వు ఇ ల్లొదిలిపెట్టి పొయి నలభై మూడేండ్లయి పోయింది' ' అన్నాడు.

స్వామి తల ఊపాడు.

ఒళ్లంతా కళ్లు చేసుకుని స్వామిని కాసేపు మౌనంగా చూస్తూ ఉండి పోయిన తర్వాత అతను "ఎన్నాళ్ల సంగతి? ఎన్ని మార్పు లొచ్చినాయి? నాకు బిడ్డలు కలిగి, వాళ్లూ పెద్దోళ్లయి, వాళ్లకూ బిడ్డలు పుట్టి, నేను తాత గూడా అయిపోయి చానా సంవత్సరా లయిపోయింది. ఇన్నేండ్లయి పొయినాక ... ఇప్పుడు కనిపిస్తా ఉండావు. నే నీ ఊరి కొచ్చి పది దినా లయి పొయింది. ఇంటి కాడ కొచ్చి మూతయినా చూపించకుండా పొయినావు. కన్న తల్లి పొయినప్పుడే ఇంటికి రాక పొయినోడివి. ని న్నేమని అడిగేది? నీతో ఏమని మాట్లాడేదిరా చిన్నబ్బా!" అన్నాడు జీరబోయిన గొంతుకతో.



## సాహస బాలలు - 9



# రైలు ప్రయాణీకులను కాపాడిన మరియప్పన్

**1995** మే 14 రాత్రి తమిళనాడు కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ పట్టణానికి చెందిన పదమూడేళ్ల మరియప్పన్ తన కుటుంబ సభ్యులతో కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రెండవ తరగతి పెట్టెలో ప్రయాణం చేస్తున్నాడు. ఆ రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో లొక్కూరు - దనిష్పేట స్టేషన్‌ల మధ్య ఆ కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ ఒక గూడ్సు బండితో ఢీకొని ఘోర ప్రమాదానికి గురి అయింది.

అదే సమయానికి బాత్‌రూమ్‌కు వెడదామని లేచి ఉన్న మరియప్పన్‌కు పక్కనే ఉన్న ఎయిర్ కండిషన్ కోచ్‌లో ఇరుక్కుపోయిన ప్రయాణీకుల హాహాకారాలు, ఆర్తనాదాలు వినపడ్డాయి. ప్రమాదాన్ని గ్రహించిన ఆ బాలుడు చీకటి అని కూడా భయపడక కిందకు దిగి కొన్ని రాళ్లు ఏరి వాటితో ఎదురుగా ఉన్న ఎయిర్ కండిషన్ కోచ్ తలుపులు బద్దలు కొట్టాడు. లోపల చిక్కుకుపోయి ఉన్న దాదాపు 15 మంది ప్రయాణీకులను బయటకు లాగాడు. అప్పటికే బండిలో విద్యుత్ ప్రసారం ఆగిపోయింది. పక్కనున్న ప్రయాణీకుడు ఇచ్చిన ఒక పెన్ టార్చి సహాయంతో కొందరు గాయపడిన ప్రయాణీకులను కూడా బయటకు తీశాడు. ఆ ప్రమాదంలో సుమారు 200 మంది ప్రయాణీకులు ప్రాణాలు కోల్పోయారు. మరియప్పన్ ధైర్యం, సాహసం చూపి తక్షణ సహాయం చెయ్యకపోతే మృతుల సంఖ్య మరింతగా పెరిగి ఉండేది.

Ⓟ అనిపెద్ది వెంకట రమణరావు

---

'నే నొచ్చినట్టుగా నీకు జాబేసినారు కదా! నే నీ చిదంబరాశ్రమాని కొచ్చి మూడు నెలలు దాటింది. బళ్లారిలో కొత్తగా వ్యాపారం పెట్టినావా?" ఒక దాని కొకటి సంబంధం లేని మాటలు మాట్లాడాడు స్వామి.

"కొత్తగా ఏమీ గాదులే!" చూపులు మరల్చుకుంటూ చెప్పసాగాడు - "ఇరవై ఏండ్లయి పాయింది. ఒకప్పుడు టీచరు వెంకట సిద్దయ్యంటే ఎవురికి తెలుసు? ఇప్పుడు ఈ పల్లెల్లో ఎక్కడైనా వెంకట సిద్దయ్య మండీ అంటే తెలియనోడు లేడు." పెద్దగా నిట్టూర్చా డతను. "అయినా ఒక రకంగా చూస్తే నీ పనే మేలుగా ఉందిరా, చిన్నబ్బా! ఎన్ని పాట్లు బడినా ఈ జానెడు కడుపు కోసరమే గదా! దీని కోసరం ఇంత ఆరాటం ఎందుకు? పెండ్లీ, పెండ్లామూ, బిడ్డలూ, ఈ జంజాటా లన్నీ ఒదిలిపెట్టి ఎక్కడికైనా దూరంగా పారిపోదా మనే ఉంటాది నా గ్గూడా! అయినా మాట్లాడినంత సునాయాసంగా పారిపోయే దానికి కుదరదు. తిరగాల్సినంత తిరిగేసుంటావు. చూడాల్సినంత దేశం చూసేసుంటావు. చిన్నప్పుడే చానా తెలుసుకున్నావురా చిన్నబ్బా నువ్వు! ఈ భూమిన్నమ్ముకుంటే ఒరిగేది లేదని కనిపెట్టేస్తివి. అదునులో వానలు పడవు. సరిగ్గా పంట చేతికి రాదు. విచ్చినా గిట్టుబాటు రేటు పలకదు. అదృష్టవశాత్తూ నా మాదిరిగా చదు వంటలేదు. సేద్యం పనికి రాలేదు. సన్యాసంలోకి దూకేస్తివి. జంజాటం లేని బతుకు. తిండి కూర్చున్న తావుకే ఎతుక్కుంటా వస్తింది. చిల్లర మల్లర కోరిక లుంటే తీరేదానికి రకరకాల దోవ లుండనే ఉండాయి. కొంచెం ధైర్యం చేసినావు. బతు కంతా సుఖపడిపాయినావు. సంసారంలో ఉండే సుఖమేందో సన్యాసంలోకి పోక ముందే తెలుసుకునేస్తివి. నీ మీద కోపం లేదురా, చిన్నబ్బా! నిజంగానే అంటా ఉండాను. నీ మాదిరి ధైర్యం ఎందురికుంటింది?"

"వైరాగ్యం అదంరికీ ఒంటబట్టదు" బింకంగా అడ్డు తగిలాడు స్వామి. "సన్యాస మంటే ఊరికే తినేసి నిద్ర పొయ్యేది గాదు. తప స్సంటే సామాన్యం గాదు. సిద్ది పొందేటప్పుడు గురువు పెట్టే పరీక్షలు తట్టుకోని నిలబడేది అందరి వల్లా అయ్యే పని గాదు!"

"నీ కుండే ఓపి కెంతో నాకు తెలియదారా చిన్నబ్బా!" వెంకట సిద్దయ్య నవ్వేశాడు. "నాలుగేండ్లు వరసగా వానలు పడక పంట సరిగ్గా చేతికి రాకపోతే మన సాదిలేస్తివి. పోరంబోకు తిరుగుళ్లు తిరగతా ఉండావని రెండు మాటలనిందని కన్న తల్లి పైన్నే మన సిరిచుకుంటివి. సంపాదన లేని మనిషని ఎవురూ లెక్కబెట్ట లేదని అయినోళ్ల నందరినీ ఒదులుకునేస్తివి..." కాస్సేపాగి మళ్లీ చెప్పసాగాడు వెంకటసిద్దయ్య - "నిన్ను ఎగతాళి చేస్తా ఉండా ననుకోవద్దు. ఇన్నేండ్లూ బతికి, ఇంత బతుకు కండ్ల జూసినాక ఇంకొకర్ని ఎగతాళి జేసే గరి వెవుడుంటాడు? ఓడు ఓడని అంతా ఓడనే రకం గాదు నేను. నిన్ను నమ్ముకోని పైరు జేసిన పంట ఎండ బెట్టేసి, ఎవురికీ మాట మాత్రమైనా చెప్పకుండా మాయ మైపోయి నప్పుడు నాకు మొదుట్లో కోపమే వచ్చింది. కొన్ని దినాలయినాక అదేదో ఆశ్రమంలో చేరిపాయినావని చెప్పినప్పుడు పీడా ఒదిలి పోయిం దనుకుంటిని. అయితే దినాలు జరగనూ జరగనూ అప్పుడు నువ్వు చేసిన పని తప్పు గాదని తెలి సొచ్చింది."

"నువ్వు చెప్పే దాంట్లో గూడా నిజ ముందిలే! సాముల్లో గూడా కొందరు దొంగ సాము లుంటారు' ' అంటూ నెమ్మదిగా మొదలెట్టాడు స్వామి. "బీహారులో ఒ కాశ్రమంలో అయిదేం డ్లుంటిని. పెద్ద స్వామి పరమపదం చేరగానే చిన్న సాములు ఒకరితో ఒకరు పోటీలు పడి తన్నుకున్నారు. అది నా తావు గాదని తెలిసి పోయింది. అప్పుటి నుంచి ఏ ఆశ్రమంలో గానీ పట్టుమని రెండేండ్లు ఉండలేక పోతిని. గండిలో మాత్రం మంచి గురువే దొరికినాడు. ఆయన అనంతరం ఆశ్రమానికి నేనే గురువని ఆయన వారసత్వపూజ గూడా చెయ్యించినాడు. కానీ ఆయన పోతానే స్వాములు కొందురు గూడుపుటానీ జేసి నన్ను పక్కన బెట్టేసినారు. ఇప్పు డీ చిదంబరాశ్రమాని కొస్తే ఇక్కడా లక్ష గొడవలు!"

"నా కంటే ను వ్వెంతో మేలని చెప్పినాను గదరా, చిన్నబ్బా!" వెంకటసిద్దయ్య పెద్దగా నిట్టూర్చాడు. "ఇరవైయ్యేండ్లు ఇంకో పని పెట్టుకోకుండా పిల్లకాయలకు పాఠాలు చెప్పినాను. ఈ పక్కనుండే హైస్కూళ్లలో నా అంత మంచి టీచరు లేడని పే రెత్తినాను. మొదుట్లో పెద్ద పెద్ద ఉద్యోగాలు జేసే పిల్లలొచ్చి 'అంతా మీ ఆశీర్వాదం, సార్!' అంటే గర్వంగా మిడిసిపడి పోయినాను. కానీ చూస్తా ఉండంగానే కాలం మారిపోయింది. బాగా చదువుకునే పిలకాయలు సక్రమంగా ఉద్యోగాలు రాక డీలా పడిపోయిరి. చదువొచ్చి ఉద్యోగా లొచ్చిన పిల్లలు గూడా చదువుల్రాని లిటిగెంటు నాయకులకు గులాము లైపోయిరి. చదువుకూ, ఆదాయానికీ, గౌరవానికీ సంబంధం లేకుండా పాయింది. పదో తరగతి పాసు గాలేని పెద్ద వాడు ఇప్పుడు పెద్ద మనిషి. ఊళ్లో ఏం పని చెయ్యాలన్నా చదువుకున్నోళ్లు గూడా వాని దగ్గిరికే

పోవాల. స్టూడెంటు ఎలక్షన్లలో ఓడిపోయిన కొంటగాలం పిలకాయ ఇప్పుడు పెద్ద పొలిటీషియను. నా దగ్గిర చెంప దెబ్బ తిన్నోళ్ల దగ్గిర నేనే తల దించుకోని ప్రాధేయ పడాల్సివచ్చింది. ఓనమాలు రాని మనుషులు కార్లూ, జీపుల్లో తిరగతా ఉంటే బాగా చదువొచ్చినోళ్లు పిచ్చి బట్టి రోడ్ల పైన పడినారు. చూస్తా భరాయించుకోలేక పోయినాను. ఉద్యోగం మింద శ్రద్ధ తగ్గి పోయింది. ఎట్ల సంపాదించినావు అనేది గాదు ముఖ్యం, ఎంత సంపాదించినావు అనేదే ముఖ్యమని తెలుసుకున్నాను. మెల్లింగా మామిడి కాయల వ్యాపారంలోకి దిగినాను. నా స్టూడెంట్లతోనే పోటీకి తయా రైనాను. అదేమీ బ్రహ్మ విద్య గాదు. కానీ మొదులు మొదుల్లో పెద్దగా పోటీ లేని వ్యాపారం ఇది. అందురూ ఏడెనిమి దేండ్లకు తోటల్ని అడమాణం పెట్టుకోని బాగా సంపాదించేసినారు. వాళ్ల కిప్పుడు కొంచెం అటు ఇటైనా పెద్దగా దెబ్బ తగలదు. కానీ కొత్తగా వ్యాపారాల్లోకి వచ్చినోళ్లకు అన్నీ ఇబ్బందులే! ఏటి కెదురీదినట్టుగా ఈ ఇరవై య్యేండ్లుగా కష్టపడి ఈ వ్యాపారాన్ని ఒక దోవకు తెచ్చినాను. ఇంకా కొంచెం పనుండాది."


మట్టి బాటపైన దుమ్ము రేపుకుంటూ డబ్బా రేకుల బస్సొకటి ముక్కుతూ మూల్గుతూ పరిగెడుతోంది. ఎక్కడో నేల మీద ఆహారం కనిపించడంతో పెద్ద గద్దొకటి తోట పైన గిరికీలు కొడుతోంది. తోట కటువైపున కుక్కల సంరంభం మిన్నుముట్టుతోంది.

"ఉద్యోగం నుంచీ రిటైరైనాక గూడా రెస్టు తీసుకోకుండా వ్యాపారంలోకి దిగినావు. చేసి నంత కాలం చేసినావు, ఇం కీ పనులు పిలకాయల చేతిలో పెట్టేసి కృష్ణా రామా అనుకోకూడదా?" అన్నాడు స్వామి.

వెర్రివాడిని చూసినట్టుగా చూస్తూ, ఓ నవ్వు నవ్వి, "నా కొడుకుల సంగతి చెప్పు. ఒకొకనిదీ ఒకో దోవ. దుర్మార్గులు కాదు. బుద్ధిమంతు లవునో, గాదో చెప్పలేను. పొరబాటు ఎక్కడ జరిగిందో, ఎవురు చేసినారో నాకు తెలియదు" అన్నాడు వెంకటసిద్దయ్య. అతడి ముఖం మరింతగా ముడుచుకుపోసాగింది. కనురెప్పలు సాగాయి. నుదుటి పైన చెమట బిందువులు కదిలాయి. పెదవులు వణకసాగాయి. "ఈ చేత్తో ఒకే మాదిరిగా చదువు చెప్పించినాను. ఎందుకు ఒకడు పైకి పొయినాడో, ఎందు కొకడు వెనకబడిపొయినాడో నాకు అంతు బట్ట లేదు. తెలియకుండా ఏదో దోవలో పోతే నక్క తోక తొక్కినా డొకడు. ఎంతో జాగ్రత్తగా ముందు కడుగేసినా అడుసు తొక్కినా డొకడు. ఇదంతా కప్పల తక్కిడ మాదిరి వ్యవహారం. తెలివితేటలకూ, జీవనానికీ సంభంధ లేదు. చేసే పనికీ, కష్టానికీ, ఫలితానికీ సంబంధం లేదు. ఇదంతా పిచ్చోడి చేతిలో గీతల మాదిరి అవకతవకల యవ్వారం!" కాస్సేపాగి మళ్లీ చెప్పసాగా డతను - "ముగ్గిరిలోనూ తెలివైనోడు నడిపోడే! అందరి కంటే బాగా చదివినాడు. వాని కెందుకో ఉద్యోగమే రాలేదు. పోనీలే వ్యాపారంలో దిగరా అంటే వాడు వినలేదు. ఏదేదో పుస్తకాలు చదివి ఈ గోచి పాతంత భూమిని రకరకాలుగా మచ్చిక జేసుకోవాలని అనుకున్నాడు. ఎందుకో ఒకటీ కలిసి రాలేదు. మిగిలిన ఇద్దురితోనూ పోలిస్తే చిన్నోడు అంత తెలివైనో డేమీ గాదు. కానీ వాని రాతే బాగుండాది. ఇంత సంపాదించు కుంటాడు. చాలనిదానికి వాని పెండ్లాం గూడా ఉద్యోగం చేస్తా ఉంది. కానీ మా పెద్దోడు గారెంటీగా పెద్ద ఆఫీస రవతాడని నమ్మకంగా ఉంటిని. డ్రైవరుగా పని చెయ్యాలనీ, పెండ్లాం బిడ్డల్ని ఒదిలి పెట్టి దేశాల బట్టీపోవాలని వానికి రాసిపెట్టుంటే నేనేం చేసేది?'
'

"దిక్కూ దరీ లేని మనుషులు మాదిరి వాళ్లు తలో దిక్కూ ఎందుకు పోవాల? వ్యాపారంలో నువ్వు సంపాదించిం దంతా వాళ్లకే గదా! ఇంక దిగు లెందుకు?" కాషాయంబరం లోకి దూరిన గండు చీమల్ని విదిలించుకుంటూ అడిగాడు స్వామి.

"నేనంటే గానీ, నా వ్యాపార మంటే గానీ వాళ్లకు లెక్క లేదు. నేనే వాళ్ల దోవకు పోవాలని అనుకుంటారు గానీ చిన్నా పెద్దా ఎంచే వాళ్లు గాదు. పగులనకా, రేత్రనకా కష్టపడి నేను సంపాదించిం దంతా వాళ్లకు పంచి ఇచ్చేసి నేనూ, నా పెండ్లామూ ఏదైనా అడివి దోవ చూసుకుంటే వాళ్ల కానందం. రిటై రైనాక వచ్చిన దుడ్డంతా వ్యాపారంలో పెట్టేసినానని నా పైన కోపం. సంవత్సరాని కొక తడవ ఆడబిడ్డలకు గుడ్డా గుసురూ తీసిస్తా వుండానని మంట. చూస్తా ఉండు, వీళ్ల కంతా సరిగ్గా బుద్ధి చెప్పేదాకా ఈ వ్యాపారం ఒదిలిపెట్టేది లేదు!" వెంకట సిద్దయ్య పిడికిళ్లు బిగుసుకున్నాయి. అప్పటి కప్పుడు గాలి నింపిన టైరులా కూర్చున్నా డతను. "ఈ పక్క తోటల్లో అంతగా గిట్టుబాటు గాలేదని బళ్లారి పక్కకు పొయినా నీ తడవ. అక్కడ తోటలు అగ్గవగానే దొరికినాయి. హొస్పేటలోనే ఇల్లు దీసుకోని, అక్కడ్నే మనుషుల్ని పెట్టి వ్యాపారం చేసినాను." కాస్సేపాగి మళ్లీ కొనసాగించాడు - "కానీ ఎక్కడైనా రూపాయకి పదా రణాలే! అంత దూరం నుంచీ లారీల్తో బెంగుళూరుకు సరుగు తోలి, ఆ ఫ్యాక్టిరీ వాళ్లకు కమీష న్లిచ్చే కాడికి అంతా ఆయమ్మే అయింది. ఈ సారి ఈ పక్క తోపులే బేర మాడతా ఉండాను. వచ్చిన దుడ్డ వచ్చినట్టే తోటల పైన పెట్టేస్తా ఉండాను. సక్రమంగా ఇల్లు గట్టుకోని, జల్సాగా బతకగూడదా అని పిల్లకాయలు ఎద్దేవా చేస్తా ఉండారు. బాగా దుడ్డు వచ్చినాక, మనం గాకపోతే ఎవు రనుభవిస్తారు? ఇప్పు డిప్పుడే కొన్ని తోటలు కుదిరేట్లుండాయి. ఆడోళ్ల బంగారం కొంచె ముంది. బ్యాంకులో పెడితే ఇంకొంచెం దుడ్డు దొరకతాది. ఇంకొన్ని తోటలు బేరమాడచ్చు." వెంకటసిద్దయ్య చూపులు గాజు పలకపైన జారే నీటి బిందువుల్లా ఆకాశపు అంచుల్లో తత్తళిస్తున్నాయి.



ఇద్దరూ కాస్సేపు అటే చూస్తూ కూర్చున్నారు. తోట కంచె దగ్గర ఎండుటాకుల గలగల వినిపించింది. పైకి రాబోతున్న కుక్క నెవరో అదిలిస్తున్న శబ్దం వినిపించింది.

ఇద్దరూ అటు వైపు తిరిగి చూశారు.

నలిగిన దుస్తులతో, చెదిరిన క్రాఫింగుతో పరుగెత్తి పరుగెత్తి అలిసిన గుర్రంలా రొప్పుతూ వచ్చాడు రామచంద్రయ్య.

"ఇదేనా రావటం?" అని పలకరించాడు వెంకటసిద్దయ్య ముక్తసరిగా.

అతను స్వామి వైపు చూసి, ముఖం ముడుచుకుంటూ, "ఇప్పుడే బస్సు దిగినాను. సాయంత్రం బస్సుకే పోవాల" అని సమాధాన మిచ్చాడు.

"అవున్లే! నీకు పను లెక్కువ. నాకు తెలియదా?' ' వెంకట సిద్దయ్య ఎగతాళి చేస్తున్నాడో, లేక అన్యమనస్కంగా మాట్లాడుతున్నాడో తెలియడంలేదు.

"ఇప్పు డైనా వచ్చే తీరిక లేదు. విషయం తెలస్తానే ఎక్కడ పని అక్కడ వదిలి పెట్టేసి పరుగెత్తు కొచ్చేసినాను."

కారణ మేమి టన్నట్టుగా చేతుల్ని తిప్పుతూ హావభావాల్తోనే ప్రశ్నించాడు వెంకటసిద్దయ్య.

"ఈ తోటా, మడీ అమ్మకానికి చెప్పేసినా రంట గదా!" రామచంద్రయ్య ఇంకా గసబోస్తూనే ఉన్నాడు.

"ఎవురు చెప్పినారు?" తాపీగా అడిగాడు వెంకటసిద్దయ్య.

"ఎవురు చెప్పితే ఏముందిలే! ఎట్నో చేతులు కాలక ముందే తెలిసింది. ముందే చెప్తా ఉండాను. వేరే మూడో మనిషికి అమ్మితే నే నొప్పుకోను. నాకే కావల్ల. పెద్ద మనుషు లెంత మతింపేస్తే అంతా ఇస్తాను!"

"మంచిది. బాగా సంంపాదించినట్టే ఉండావు!' ' అదే ధోరణిని కొనసాగించాడు వెంకటసిద్దయ్య.

"ఎట్లో ఒకట్ల కష్టపడక పోతే తప్పదు గదా!" నిట్టూర్చాడు రామచంద్రయ్య. "కండ్ల ముందర్నే తన్నుకోని పోతా ఉంటే చూస్తా ఉండే నిబ్బరం లేదు నాకు. టౌను బ్యాంకీలో అప్పిస్తారు. జీపిఎఫ్ లోను వస్తాది. అడంగలో తీసక పోతే బంగారంపైన తక్కువ వడ్డీకి అప్పు బుట్టించవచ్చు. నాలు గైదేండ్లు చేతుల్లో సరిగ్గా దుడ్డాకుండా కటకటబడాల్సి రావచ్చు. అదంతా మీకేల? నా పాట్లు నేను పడతాను!"

కాలచక్రం కాస్సేపు మెల్లగా కదిలింది.

మామిడి చెట్ల కొనకొమ్మల్లో కాకు లెందుకో గోల చేస్తున్నాయి.

బొమ్మల్లా కూర్చుండి పోయిన ముగ్గురూ పెద్దగా స్కూటరు శబ్దం వినిపించగానే కంగారు పడి తిరిగి చూశారు.

నేరుగా వాళ్లు కూర్చున్న చోటికే వచ్చి ఆగింది స్కూటరు. గంటల తరబడీ ప్రయాణం చేశాడన్న చిహ్నంగా అతడి జుల్లు గాలివానలో చెదిరిన వరిపైరులా చెల్లా చెదురైపోయి ఉంది. ముఖం బాగా డస్సిపోయి ఉంది. ఆకులు రాల్చుకున్న చెట్టులా దిగాలుగా ఉన్న ముఖంతో ముగ్గురినీ మార్చి మార్చి చూసి, స్కూటరు స్టాండు లాగుతూ, "అంతా ఇక్కడే జేరి అంతా మీరే నిర్ణయించేసినారా? నా చెవిలో ఒక ముక్కేయాలన్న ఆలోచనైనా ఒక్కరికీ రాలేదా?" అంటూ నిష్ఠురంగానే ప్రారంభించాడు రాజగోపాల్.

"నువ్వు చెప్పే దేం సంగతి నాయనా?" వెంకటసిద్దయ్య గొంతుకలో కోపమూ, ఎగతాళీ కలిసి ధ్వనించాయి.

స్కూటరు పైన అలాగే కూర్చుని, "తోట అమ్మకం సంగతే! న న్నో మాట అడగకుండా బేరానికి పెట్టేసినారు గదా! ఎవురు చెప్పినారని అడగద్దు. ఇట్లాంటి విషయాలు దాచి పెడ్తే దాగతాయా? ఎట్నో గాలిపోవిడిగా తెలిసింది. రెండు దినాల్లో ప్రయాణం పెట్టుకోనుండాను. ఇప్పుటి కిప్పుడు అమ్మెయ్యాలని ఎందుకు బుద్ధి పుట్టింది?' ' అని చీకాకు పడసాగాడు రాజగోపాల్.

"షార్జాకు వీసా దొరికిందా?" అడిగాడు రామచంద్రయ్య.

"షార్జాకు గాదు, యెమన్‌కు పోతా ఉండాను. మొన్ననే వీసా ఇచ్చినారు. ఎక్కడ పని అక్కడ ఒదిలిపెట్టేసి వచ్చినాను. గంట లోపల బయల్దేరేయాల! వెయ్యి మాట లొద్దు. ముందే చెప్తా ఉండాను. తోటంతా నాకే కావాల. ఊరికే ఏమీ ఇయ్యద్దండి! పరాయి మనిషి కయితే ఎంత కిస్తారో అంతకే ఇయ్యండి. దుడ్డు కావాలంటే ఇప్పటి కిప్పుడు ఇయ్యలేను. టౌన్లో రెండు ప్లాట్లుండాయి. బేరానికి చెప్పేసినాను. ఆరు నెలల్లో అంతా సర్దేస్తాను."

విన్నంత సేపూ విని, స్వామి కేసి తిరిగి, "చూసినావా చిన్నబ్బా! ఇదీ కొడుకుల ప్రతాప మంటే!" అంటూ పెద్దగా నవ్వేశాడు వెంకటసిద్దయ్య. "నడిపోడి కీ తోపుతో, మడితో తల బొప్పి గట్టింది. అయినా అమ్మేయాలని అనుకునిం దానికి అదొక్కటే గాదులే కారణం. ఇది ఉమ్మడి సొత్తు. ఎప్పుడైనా భాగాలు పోవాల్సిందే గదా! అమ్మేసి అత్త గారి ప్రాపకంలోకి పోవాలని ఆరాటం. ఈ పల్లె కొంపల్లో గాలి వార్తలు ఇట్లే పుడతాయి. ఒకటి జరిగితే రెండుగా చెప్పుకుంటారు. తండ్రనే మనిషి బతికుండగానే ఒక కొడుకు ఆస్తి అమ్మకానికి పెట్టేసినాడు. ఇద్దరు కొనేందుకు రెడీ అయిపొయినారు. ఇదీ సంసార్ల గతి!"

ఎవరూ ఉలక లేదు, పలక లేదు.

వెంకటసిద్దయ్య మళ్లీ పెదవి కదిపాడు - "ఇది మంచి కాలం గాదు. లేకుంటే పెద్దా చిన్నా లేకుండా పోతిందా? భూమంతా వాని కొకనికే ఇచ్చేస్తే ఏందో పొడిచేస్తా నంటాడు నడిపోడు. ఎంత చెప్పినా వినకుండా టమేటో పైరు పెట్టినాడు. చెట్లల్లో చూడు, బోండి! వద్దంటే కాత. చెట్లల్లోనే మాగిపోతా ఉండాయి. రేటు డౌను. మొన్ననే ఆస్పత్రి నుంచి వచ్చినాడు. ఇంకా ఒళ్లు పూర్తిగా గుణం గాలేదు. వద్దు వద్దని నెత్తీ నోరూ కొట్టుకుంటా ఉంటే పట్టించుకోకుండా ట్రాక్టరు కాయ లేసుకోని కలికిరికి పొయినాడు."

ఎండి పోతున్న పెదవుల్ని నాలుకతో తడుపుకున్న తర్వాత అతనే కొనసాగించాడు - "మామిడి కాయల వ్యాపారం చేసే వాళ్లకు సొంత తోపు ఉండాల. ఈ రెండెకరాల భూమిలో గూడా

## జోక్

**ఒక వేశ్య దగ్గరకు వెళ్లి డబ్బులు ఇస్తూ ఓ మహానుభావుడు ఇలా అన్నాడు: "ఏమయినా.... నీ జీవితం చాలా దారుణం!"**

**" నేను కష్టపడి ఆర్జిస్తున్నాననే తృప్తి ఉంది. కానీ... నా దగ్గర మామూళ్లు తీసుకుంటారే... వాళ్లది దారుణమయిన బ్రతుకు...' అన్న దా వేశ్య.**

**- చిదానందం**

మామిడి చెట్లు పెట్టేసి పెద్ద తోటగా తీర్చాల. ఇంకా కొన్ని తోటలు అడమాణం పెట్టుకోని, వ్యాపారంలో కొంచెం పట్టు దొరికించుకోవాలని నేను తాపత్రయ పడతా ఉండాను. తెల్లారి జామున్న బయల్దేరినోన్ని, ఈ బండి పైన్నే ముప్పయి మైళ్ల దాకా తిరిగి తోటలన్నీ చూసొస్తా ఉండాను. వీళ్ల కథేమో ఇట్లుండాది. ఎవురితో చెప్పుకునేట్టుండాది? నగుబాట్లు బతు కయిపోయింది గదా!"

కంచె కవతల కుక్కలు పెద్దగా మొరగసాగాయి.

పరుగెత్తుకుంటూ వచ్చా డో యువకుడు.

చెమ టోడుతున్న అతడి ఆకారం అప్పుడే నీళ్లలోంచి బయట పడేసిన తాబేలులా నల్లగా నిగనిగలాడుతోంది.

"పెదనాయినా! రెడ్డప్పన్నకు మళ్లా తిరగ బెట్టేసింది. ఆస్పత్రిలో చేర్పించినారు!" ఆవేదనతో వణుకుతున్న గొంతుకతో దూరం నుంచే బిగ్గరగా అరిచా డతను.

ఒక్క ఉదుటున లేచి నిల్చుని, "ఏమైందిరా?" ' అని ఆక్రోశించాడు వెంకటసిద్దయ్య.

"పొద్దన ట్రాక్టరులో కలికిరికి పొయినాము గదా! మార్కెట్టు నిండా సరుకే! కేజీ అర్ధ రూపాయ. సరుకు కొనే మనిషే కనబడలేదు. ఎనక్కు తిరుక్కోని వచ్చేద్దామంటే ట్రాక్టరు బాడిగ దండగ. కాయలు దించే దానికి మార్కెట్టులో తావే దొరకలేదు. చేసే దేమీ లేక కలికిరి చెరువులో ట్రాక్టరు తక్కాళి పండ్లు దిమ్మరించేసి ఎనక్కు మళ్లితిమి. ఏమైందో ఏమో, పోతా పోతా ఉండే ట్రాక్టరులోంచి ధనేల్మని పడి పొయినాడు రెడ్డప్పన్న. ఎనక చక్రం పై కెక్కేసింది!"

"ఇప్పు డెట్లుండాదిరా?" చీకాకు పడుతూ అడిగాడు రామచంద్రయ్య.

"గవర్మెం టాసుపత్రిలో చేర్పించినారు. పోలీసులొచ్చి పెద్ద గలాటా జేసి డ్రైవర్ను పట్టుకోని పొయినారు. పడిపోలేదు, కావాలనే దూకేసినాడు అంటా ఉండా డా డ్రైవరు."

"డాక్టర్లేమంటా ఉండార్రా?" కసురుకున్నాడు రాజగోపాల్.

"కష్టం ... కొంచెం కష్టంగానే ఉండా దన్నారు' ' అతను గ్రుక్కిళ్లు మింగసాగాడు. "ఇప్పుడిప్పుడే ఏ మాటా చెప్పలే మన్నారు. రక్తం చానా పోయిందంట! పెద్దోళ్లని బిన్నాగా ఆస్పత్రి కాడికి రమ్మన్నాడు."

నిలువునా కంపిస్తున్న శరీరంతో మోటారు బైకు స్టాండు లాగాడు వెంకటసిద్దయ్య.

రాజగోపాల్ స్కూటరు స్టార్టు చేశాడు. రామచంద్రయ్య స్కూటరు వెనక సీటు పైన కూర్చున్నాడు.

"మీరు నేరుగా ఆస్పత్రి కాడికే పొండి, పెదనాయినా! నే నొకసారి ఇంటికి పొయి, రాత్రి బస్సుకు వచ్చేస్తాను" అన్నా డా యువకుడు.

వాహనాలు రెండూ రోడ్డు వైపు ఉరకలెత్తాయి.

తానూ పైకి లేచి నేల కతుక్కుపోయినట్టున్న పాదాలను బలవంతంగా కదిలించాడు స్వామి. పైకి రాబోతున్న ఏడుపు నాపుకుంటూ, 'రెడ్డప్పన్న పొద్దున్నించీ ఇష్ట మొచ్చినట్టుగా మాట్లాడతా ఉన్నాడు. ఈ సారి కోళ్ల ఫారం పెట్టాలనీ, ఎన్ని గుడ్లు, ఎన్ని పిల్ల లవతాయి అనీ లెక్క లేస్తా ఉన్నాడు. మార్కెట్టు కాడ కొచ్చి నప్పటి నుంచీ నోటికి బీగా లేసినట్టుగా గొమ్మనే ఉండిపొయినాడు. ఇట్లా చేస్తాడని అనుకోలేదు. పెదనాయిన కెట్ల జెప్పేదో తెలియ లేదు. డాక్టర్లు చెప్పే దాన్ని బట్టి జూస్తే ఆశలు వదులుకో వల్సిందే ననిపిస్తా ఉండాది!" అన్నాడు స్వగతంలా.

తోట వెలుపలి కొచ్చాక "నీ దే ఊరు నాయనా?" అని ప్రశ్నించాడు స్వామి.

"పెదనాయనది మా పక్కిల్లే. వాళ్లూ, మేమూ పాలోళ్లం!" ఉద్వేగాన్ని ఆపుకోడానికి ప్రయత్నిస్తూ చెప్పా డతను.

"ఎవురు ఎప్పుడు పోవాలని రాసిపెట్టి ఉందో ఎవురికి తెలుసు? అంతా మాయ ... కర్మ ... ప్రారబ్దం, నాయనా!" అని నెమ్మదిగా చెప్పి, కాస్సేపాగి రహస్యం చెబుతున్నట్టుగా స్వరం తగ్గించి, "నువ్వు ఊరికి పోవాలేమో గదా! నేను ఆశ్రమానికి పోతాను. అయినా ఆశ్రమం అంత దూరంలో ఉంటే ఏం బాగుంటుంది? అందుకే ఇక్కడ్నే ఒక ఆశ్రమం స్థాపించాలని సంకల్పం పుట్టింది" అన్నాడు స్వామి.

అతడి మాటలు అర్థం కాక "ఇక్క డంటే?" అని బిక్కమొహం పెట్టా డా యువకుడు.

'ఈ మామిడి తోటలోనే! భగవత్కార్యం కోసరం కైంకర్యం చేసే దానికి ముందు కొచ్చే భక్తు లెందు రుండరు? వాళ్లు పూనుకుంటే ఇదొక లెక్కలో ఉండే పని గాదు. పైగా వాళ్లు కొనాల్సింది ఇందులో సగ భాగమే కదా! అంతా గురువాజ్ఞ! మన దేముంది,నిమిత్తమాత్రులం!' వేదాంతీకరిస్తూ నవ్వి స్వామి ముందుకు కదిలాడు.


బుర్ర గోక్కుంటూ, గ్రుక్కిళ్లు మింగుతూ ఊరి వైపు తిరిగి నడవ సాగా డా యువకుడు.

ఎర్రటి ధూళిని రేపుతూ పశువులు ఊరి వైపు పరిగెడుతున్నాయి. మెల్లగా పరచుకుంటున్న చిరుచీకటి తెరల మధ్య పడమటి ఆకాశంలోని ఎర్రని రంగు అప్పుడే చిందిన రక్తంలా మెరుస్తోంది.

దూరంగా మట్టి రోడ్డు మలుపు తిరుగుతున్న చోట రెండు వాహనాలు రేపిన ఎర్రటి దుమ్ము సుళ్లు తిరుగుతోంది.

దోర ఎరుపు రంగు తెరల మధ్య నీడలా కరిగిపోతూ విమలప్రకాశానందస్వామి ఆకారం బరువైన వస్తు వేదో మెల్లగా ఒర్లుతున్నట్టుగా ముందుకు సాగుతోంది.

పెద్ద రాబందులు రెండు నేల మీద వాలినట్టుగా రాళ్ల గుట్టలు రెండూ భీకరంగా మిగిలాయి. వాటి పాదాల దగ్గరి మామిడి తోట ఆకు పచ్చని ఎండమావిలా ఊరిస్తూనే ఉంది.




P అయిపోయింది